www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   మంగళవారం 24-01-2023   సంపుటి : 04   సంచిక : 134   పేజీలు : 4   వెల : రూ 3-00



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A., L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

## అసెంబ్లీ ముందుకు 3 రాజధానుల బిల్లు

విజయవాడ, జనవరి 23,ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు వచ్చే నెలలో జరగనున్నాయి. మొదటి వారంలో సమావేశాలు ఉండే అవకాశముంది. అయితే ఈ సమావేశాల్లో మూడు రాజధానుల బిల్లులను ప్రవేశపెట్టనున్నారన్నది సమాచారం. ఇప్పటికే నాలుగేళు గడిచిపోయింది. మూడు రాజధానుల బిల్లులు గతంలో సభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం తిరిగి వెనక్కు తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా సభలో తిరిగి బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



ఈ మేరకు న్యాయశాఖ కసరత్తులు చేస్తుందని చెబుతున్నారు. విశాఖలో పరిపాలన రాజధాని, అమరావతిలో శాసన రాజధాని, కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేస్తామని మూడున్నరేళ్ల క్రితం ముఖ్యమంత్రి జగన్ శాసనసభలో ప్రకటించారు. అయితే న్యాయపరమైన చిక్కులు కారణంగా ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. మరోవైపు అమరావతి రైతులు ఏకైక రాజధానిగా ఉంచాలంటూ ఆందోళనను కొనసాగిస్తూనే ఉన్నారు. హైకోర్టు కూడా అమరావతి రైతులకు, ప్రభుత్వానికి మధ్య కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మరోసారి మూడు రాజధానుల బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతుండటం చర్చకు దారి తీస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర మాత్రమే సమయం ఉంది. ఎన్నికలు దగ్గరపడే లోపు మూడు రాజధానుల విషయంలో వేగవంతమైన స్టెప్ తీసుకోవాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనపడుతుంది. మూడు రాజధానుల బిల్లులను వెనక్కు తీసుకునేటప్పడే జగన్ శాసనసభ సాక్షిగా ప్రకటించారు. బలంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరిగి బిల్లులను తెస్తామని చెప్పిన విషయాన్ని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ విధానమంటూ ప్రజల్లోకి వెళ్లాలంటే ముందడగు వేయకతప్పదని వైసీపీ నేతలు చెబుతున్నారు. అందుకోసమే ఏప్రిల్ నాటికి ముఖ్యమంత్రి విశాఖ నుంచి పరిపాలన ప్రారంభిస్తారని కూడా మంత్రులు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. విశాఖలో ముఖ్యమంత్రి కార్యాలయం ఏర్పాట్లు కూడా చురుగ్గా సాగుతున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రాజధానుల బిల్లులను ఏ రూపంలో సభ ముందుకు తీసుకువస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఇటీవల ప్రధాని మోదీని కలిసినప్పుడు కూడా ముఖ్యమంత్రి జగన్ ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాసనసభలో చట్టం చేయడం ద్వారా మరోసారి న్యాయస్థానం ఎదుటకు సమస్య వెళ్లినా ఇబ్బందులు ఎదురుకాకుండా, న్యాయపరమైన చిక్కులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారని చెబుతున్నారు. న్యాయ నిపుణులతో సంప్రదించిన తర్వాతనే బిల్లులు సభ ముందుకు ప్రభుత్వం తెస్తుందని అంటున్నారు. మొత్తం మీద వచ్చే నెలలో జరగనున్న బడ్జెట్ సమావేశాలు దాదాపు ఇరవై రోజులకు పైగానే జరుగుతాయి. ఈ సమావేశాల్లోనే మూడు రాజధానుల బిల్లులు తిరిగి ప్రవేశ పెడతారని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

## ఏపీ రోడ్లపై విషప్రచారానికి అలా చెక్ పెట్టండి

### ఆర్ అండ్ బీ సమీక్షలో సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో రోడ్ల పరిస్థితిపై దురుద్దేశంతోనే కొన్ని మీడియా సంస్థలు నెగెటివ్‌గా ప్రచారం చేస్తున్నాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన రోడ్లు, భవనాల శాఖపై పంచాయితీరాజ్, పురపాలక, గిరిజన సంక్షేమశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల వద్ద ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో ఉన్న రోడ్లను పూర్తిగా బాగు చేయండి. కొత్తగా వేస్తున్న రోడ్లను నాణ్యతతో వేయండి. మరలా రెండేళ్లకే రిపేర్లకు వచ్చే అవకాశం కనిపించకూడదు. కనీసం ఏడేళ్లైనా అవి పాడవ్వకుండా ఉండేలా చూసుకోండి. తద్వారా నిర్వహణ కూడా సజావుగా, నాణ్యతతో సాగుతుందని అధికారులను ఆదేశించారాయన. ఇందుకోసం నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని.. అందులో ప్రధానమైన రోడ్లన్నింటినీ పూర్తిచేయాలని సూచించారాయన.ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నేల స్వభావం రీత్యా రోడ్లు త్వరగా పాడైపోతున్నాయని, భారీ వాహనాలు తిరిగే సరికి కుంగిపోతున్నాయని అధికారులు సీఎం జగన్‌కు నివేదించారు. అయితే.. ఇలాంటి చోట్ల ఫుల్ డెప్త్ రిక్లమేషన్ (ఎఫ్‌డీఆర్) టెక్నాలజీని వాడితే ప్రయోజనం ఉంటుందని అధికారులు ప్రతిపాదించగా.. అందుకు సీఎం వైఎస్ జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారుఖర్చు ఎక్కువైనా నాణ్యత బాగుంటుందన్న సీఎం జగన్.. మొదటి దశలో వేయి కిలోమీటర్ల మేర ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో చేపట్టాలని ఆదేశించారు. వచ్చే జూన్, జులైకల్లా ఈ పద్ధతిలో నిర్దేశించుకున్న మేరకు రోడ్లు వేయాలని, అలాగే అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిలను కూడా పూర్తిచేయాలని సీఎం జగన్ అధికారులకు తెలిపారు. కడప, బెంగళూరు రైల్వేను లైనుపై దృష్టిపెట్టాలని, విశాఖ నుంచి భోగాపురానికి వెళ్లే రోడ్డు నిర్మాణంపైనా దృష్టిపెట్టాలని అధికారులకు తెలిపారాయన.అధికారులతో సీఎం జగన్.. రోడ్లు బాగు చేసిన తర్వాత నాడు – నేడు ద్వారా ఆ వివరాలను ప్రజల ముందు ఉంచాలని అధికారులకు సీఎం జగన్ సూచించారు. "ఇంత ఖర్చుచేసి రోడ్లు బాగుచేస్తున్నా నెగిటివ్ ప్రచారం తప్పట్లేదు. దురుద్దేశంతో కొన్ని మీడియా సంస్థలు నెగెటివ్ ప్రచారం చేస్తున్నాయి. ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నా.. కంటగింపుతో విష ప్రచారం చేస్తున్నాయి. వాళ్ల కడుపుమంటకు మందులేదు. అందుకే మనం చేస్తున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచాలి. అన్ని ప్రభుత్వ శాఖలో నాడు– నేడు శీర్షిక కింద మనం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచాలి. ఆయా ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లలో కూడా ఈ వివరాలు ఉంచాలి అని అధికారులకు సీఎం జగన్ సూచించారు.పట్టణాలు, నగరాల్లో ఎప్పటికప్పుడు రోడ్ల రిపేర్లను చేసేందుకు ఉద్దేశించిన ఏపీసీఎం ఎంఎస్ యాప్‌ను ఈ సమీక్షా సమావేశంలోనే సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పౌరులు ఎవరైనా ఈ యాప్ ద్వారా రోడ్ల గురించి ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. అలాగే.. ఫొటోలను సైతం అప్‌లోడ్ చేసే అవకాశం ఉంది ఈ యాప్‌లో. జియో కోఆర్డినేట్స్‌తో పాటుగా ఫిర్యాదు నమోదుతో పాటు దీనిపై కమాండ్ కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేసింది ప్రభుత్వం. అలాగే.. ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని వెంటనే చర్యలు చేపడతారు అధికారులు.నాణ్యత మీద ప్రత్యేక దృష్టి పెట్టినప్పుడు ఏ సమస్యలు రావని సీఎం జగన్.. అధికారులతో అన్నారు. పట్టణాలు, నగరాలు ఎక్కడైనా సరే రోడ్ల మరమ్మతులు నాణ్యమైన ప్రమాణాలతో జరగాలని పేర్కొన్నారాయన. ఫలానా చోట రోడ్డు రిపేరు చేయాలని ఏపీసీఎం ఎంఎస్ ద్వారా ఫిర్యాదు అందితే.. 60 రోజుల్లో దాన్ని బాగు చేయాలి. ఈ లక్ష్యాన్ని తప్పనిసరిగా పాటించాలి. అంతేకాదు.. యాప్ పనితీరు, అందులో వస్తున్న ఫిర్యాదుల పరిష్కారంపై నిరంతరం సమీక్ష, పర్యవేక్షణ ఉండాలి. రోడ్ల మరమ్మతులపై అధికారులంతా ప్రత్యేక దృష్టిపెట్టాలి. కేవలం రిపేర్ మాత్రమే కాదు.. నాణ్యత మీదా ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్ల రిపేర్‌లో దీర్ఘకాలం నిలిచేలా టెక్నాలజీ సాయం తీసుకోండి. ఇకపైన కూడా రోడ్ల నిర్వహణలో గణనీయమైన మార్పులు రావాలని సీఎం జగన్ అధికారుల వద్ద ఆకాంక్షించారు.

## జీవో నెం.1పై చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు.. విచారణ వాయిదా



న్యూఢిల్లీ: ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం 1పై రాష్ట్ర హైకోర్టు చేపట్టిన విచారణ రేపటికి వాయిదా పడింది. జీవో నెం.1ను తాత్కాలికంగా నిలిపివేతను కొనసాగించేందుకు హైకోర్టు నిరాకరించింది.ఫలితంగా జీవో నెం1పై ఉన్న స్టే ముగిసింది. అదే సమయంలో జీవో నెం.1 అమల్లోకి వచ్చినట్లయ్యింది.నేడు విచారణ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వెకేషన్ బెంచ్ డీఫాక్టో చీఫ్ జస్టిస్‌లా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసును స్వీకరించడం ద్వారా వెకేషన్ బెంచ్ తన పరిధిని మించి వ్యవహరించదన్నారు. ప్రతి కేసు ముఖ్యమైనదేనని భావించుకుంటూ వెళ్తే హైకోర్టు ఏమైపోవాలని అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటివి జరిగితే ప్రతి వెకేషన్ జడ్జి చీఫ్ జస్టిస్ అయిపోయినట్లేనని వ్యాఖ్యానించారు.పిటిషన్ మూలాల్లోకి వెళ్లి చూస్తే అంత ఎమర్జెన్సీ కూడా అనిపించలేదని, ఈ కేసు గురించి, దాని మూలాల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నానని హైకోర్టు చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు. తనకేమీ తెలియదని అనుకోవద్దని, రిజిస్ట్రీ ఎప్పటికప్పుడు తనకు నివేదించిందని తెలిపారు. హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా తన అధికారాలను పూర్తిగా వినియోగిస్తానని స్పష్టం చేశారు.తన పిటిషన్ స్వీకరించాలంటూ వెకేషన్ కోర్టు ముందు ధర్నా జరిగిందా? అంత అర్జెంటుగా వెకేషన్ బెంచ్‌లో లంచ్ మోషన్ ఎందుకు వేశారని ప్రశ్నించారు. ఎలాంటి అత్యవసరం లేనప్పుడు లంచ్ మోషన్ వేయాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. కాగా జీవో నెం 1పై ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ విచారించాలని సుప్రీంకోర్టు ఆదేశంపై హైకోర్టు విచారణ చేపట్టింది.

## అండమాన్ దీవులకు పరమ్ వీర్ చక్ర గ్రహీతల పేర్లు.. నామకరణం చేసిన ప్రధాని



దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ సోమవారం అండమాన్ నికోబార్(లోని 21 దీవులకు పేర్లు పెట్టారు. 21 మంది పరమ్‌వీర్ చక్ర గ్రహీతల పేర్లు వీటికి పెట్టారు.పరాక్రమ్ దివస్‌ను పురస్కరించుకొని.. పేర్లు లేని వాటికి తాజాగా పేర్లు పెట్టారు. అలాగే నేతాజీ గౌరవార్థం ఒక జాతీయ స్మారకం నమూనాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా పాల్గొన్నారు.'ఈ అండమాన్ గడ్డ మీదే మొదటిసారి మన త్రివర్ణపతాకం రెపరెపలాడింది. స్వతంత్ర భారత్‌కు చెందిన ప్రభుత్వం మొదట ఇక్కడే ఏర్పాటైంది. ఈ రోజు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి. ఈ రోజును దేశం పరాక్రమ్ దివస్‌గా నిర్వహిస్తోంది. ఈ 21 మందికి దేశమే అన్నింటికంటే ముఖ్యం. ఈ పేర్లు పెట్టడం ద్వారా వారి తీర్మానం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. అలాగే అండమాన్ అభివృద్ధి దిశగా ఎనిమిదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది' అని ప్రధాని వెల్లడించారు.అండమాన్ దీవుల్లో పేరులేని పెద్ద దీవికి మొదటి పరమ్ వీర్ చక్ర గ్రహీత మేజర్ సోమ్‌నాథ్ శర్మ పేరుతో నామకరణం చేశారు. ఆయన నవంబర్ 3, 1947లో శ్రీనగర్ విమానాశ్రయం వద్ద పాక్ చొరబాటుదారులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయారు. ఇలా మొత్తం 21 దీవులకు పేర్లు పెట్టారు. 'రియల్ లైఫ్ హీరోలకు సముచిత గౌరవం ఇవ్వడానికి ప్రధాని అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. దానికి అనుగుణంగానే పేర్లు లేని 21 దీవులకు పరమ్ వీర్ చక్ర గ్రహీతల పేర్లు పెట్టాలని నిర్ణయించారు' అని ప్రధాన మంత్రి కార్యాలయం వెల్లడించింది.2018లో మోదీ.. రోజ్ ఐలాండ్స్‌కు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ద్వీప్‌గా పేరుపెట్టిన సంగతి తెలిసిందే. ఇక్కడే ఇప్పుడు జాతీయ స్మారకాన్ని నిర్మించేది. అలాగే నీల్ ఐలాండ్, హేవ్‌లాక్ ఐలాండ్‌కు షహీద్ ద్వీప్, స్వరాజ్ ద్వీప్‌గా పేరు మార్చిన సంగతి తెలిసిందే.

## గవర్నర్‌ను ఎందుకు కలిశారు.. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి నోటీసులు




అమరావతి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఇటీవల గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను కలవడంపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ కోరింది.ఈ మేరకు ఆ సంఘానికి నోటీసులు జారీ చేసింది. మీడియా, పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా నోటీసులు ఇస్తున్నట్లు పేర్కొంది. వేతనాలు, ఆర్థిక అంశాలపై ప్రభుత్వాన్ని సంప్రదించే ప్రత్యామ్నాయ మార్గాలు ఉండగా.. ఎందుకు కలిశారని ఆ సంఘాన్ని ప్రభుత్వం ప్రశ్నించింది. గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయడం రోసా నిబంధనలకు విరుద్ధమని.. సంఘం గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో వారంలోపు చెప్పాలని ఆదేశించింది.ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతభత్యాలు అందేలా చట్టం చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ ఆధ్వర్యంలో నేతలు ఇటీవల గవర్నర్‌ను కలిశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో దీనిపై వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆ సంఘానికి నోటీసులు జారీ చేసింది.

## తితిదే ఆదాయం ప్రభుత్వానికి వెళ్లే ప్రసక్తే లేదు: ఈవో ధర్మారెడ్డి

తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవారి వైభవాన్ని నలుదిశలా వ్యాప్తి చేయడంలో భాగంగా శ్రీవాణి ట్రస్టు నిధులతో 2,068 ఆలయాల నిర్మాణం చేపట్టినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి తెలిపారు.రాష్ట్రంలోని 26 జిల్లాలతోపాటు తెలంగాణ, పుదుచ్చేరి, కర్ణాటక రాష్ట్రాలలో ఈ ఆలయాల నిర్మాణం జరుగుతోందని.. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ ధర్మప్రచారంలో భాగంగా శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు (శ్రీవాణి)ను 2019లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రూ.లక్ష లోపు విరాళం అందించే దాతలకు కూడా ప్రయోజనాలు వర్తింపచేయాలనే ఉద్దేశంతో శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేలు విరాళం అందించే దాతలకు ఒక బ్రేక్ దర్శన టికెట్ జారీ చేస్తున్నామని వివరించారు.

ఇప్పటివరకు రూ.650 కోట్లు విరాళాలు..

శ్రీవాణి ట్రస్టు నిధులతో పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం, ఆలయాల ధూపదీప నైవేద్యాలకు ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. శ్రీవాణి ట్రస్టుకు ఇప్పటివరకు దాతల నుంచి రూ.650 కోట్ల విరాళాలు సమకూరాయని చెప్పారు. సమరసత సేవా ఫౌండేషన్ సహకారంతో 2019వ సంవత్సరానికి ముందు 502 ఆలయాలు నిర్మించినట్టు వెల్లడించారు. అనంతరం ఈ ఫౌండేషన్ సహకారంతో 320 ఆలయాల నిర్మాణానికి రూ.32 కోట్ల శ్రీవాణి నిధులు మంజూరు చేశామని.. వీటిలో 110 ఆలయాలు ఒక నెలలో, 210 ఆలయాలు ఆరు నెలల్లో పూర్తవుతాయన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ సౌజన్యంతో వెనుకబడిన ప్రాంతాల్లో 932 ఆలయాల నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లు కేటాయించామని, దశలవారీగా ఇప్పటివరకు రూ.25 కోట్లు మంజూరు చేశామని వివరించారు.అదేవిధంగా, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 150 పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని, ఇందుకోసం రూ.130 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ.71 కోట్లు విడుదల చేశామన్నారు. ఈ విధంగా 1402 ఆలయాల నిర్మాణం ఆరు నెలల్లో పూర్తవుతుందన్నారు. మరో 667 ఆలయాల నిర్మాణానికి వినతులు పరిశీలనలో ఉన్నాయని.. త్వరలోనే వీటిని ఖరారు చేసి నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల కోసం ప్రతినెలా ఆలయ కమిటీ బ్యాంకు అకౌంట్‌లో రూ.5 వేలు జమ చేస్తామని, ఇందుకోసం రూ.12.50 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణకు ప్రతినెలా రూ.2 వేలు ఆలయ కమిటీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్టు వివరించారు. ఆలయాల నిర్మాణం జరుగుతున్నప్పుడు, పూర్తయిన తర్వాత ఆలయ నిర్వహణను తితిదే బృందం తరచూ తనిఖీ చేస్తుందని ఈవో వివరించారు.

## టీటీటీ సిబ్బంది వైఫల్యం

తిరుమల శ్రీవారి ఆలయంపై డ్రోన్స్ తిరుగుతుంటే.....భద్రత సిబ్బంది ఏంచేస్తుందని బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. యాంటీ డ్రోన్ సిస్టంను టీటీడీ వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేసారు. డిఆర్డివో అధికారులతో ఏడాది క్రితం యాంటీ డ్రోన్ సిస్టంపై చర్చలు జరిపిన.... దాని అమలులో జాప్యం అయిందన్నారు. వెంటనే డిఆర్డివో అధికారులతో చర్చ జరిపి....టీటీడీ అధికారులు., రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి యాంటీ డ్రోన్ సిస్టం అమలు చేయాలనీ కోరారు. ఐఐటి నిపుణులు తెలిపిన విధంగా తిరుమలలో జాగ్రత్తచర్యలు తీసుకోవాలని సూచించారు.

# సంపాదకీయం

మంగళవారం 24-01-2023

## రష్యాతో మంత్రాంగం అదుపులో పెట్రో ఉత్పత్తులు

2021 డిసెంబరు నెలతో పోలిస్తే 2022 డిసెంబరులో రష్యా నుంచి దిగుమతి చేసుకున్న ముడి చమురు 33 రెట్లు పెరిగింది. మన దిగుమతుల్లో అగ్రస్థానంలో ఉన్న ఇరాక్‌ను వెనక్కు నెట్టి రష్యా ముందుకు వచ్చింది. డిసెంబరు నెలలో రోజుకు పన్నెండు లక్షల పీపాలను మనం దిగుమతి చేసుకున్నాము. జనవరిలో 17 లక్షలకు పెరిగింది. మన దేశం ఏడాది క్రితం దిగుమతి చేసుకున్న ముడి చమురులో అక్కడి నుంచి వచ్చేది కేవలం 2 శాతమే, అలాంటిది ఇప్పుడు 25 నుంచి 30 శాతానికి చేరింది. ఇరాక్ నుంచి 8.86 లక్షలు, సౌదీ అరేబియా నుంచి 7.48 లక్షల పీపాలు దిగుమతి చేసుకున్నాముఉక్రెయిన్‌పై ప్రత్యేక సైనిక చర్యను అమలు చేస్తున్న రష్యాను దెబ్బ తీసేందుకు ప్రకటించిన అనేక ఆంక్షల్లో భాగంగా డిసెంబరు ఐదవ తేదీ నుంచి తాము నిర్ణయించిన పీపా 60 డాలర్ల ధరకు మించి ఎవరూ కొనుగోలు చేయరాదని, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే వారి మీద కూడా ఆంక్షలు ప్రకటిస్తామని అమెరికా, ఐరోపా సమాఖ్య, జి 7 కూటమి, మరికొన్ని దేశాలు ప్రకటించాయి. వాటిని ఆమోదించిన దేశాలకు తాము విక్రయించేది లేదని పుతిన్ ప్రకటించాడు. ఉక్రెయిన్ సంక్షోభానికి ముందు మన దేశం వంద పీపాలు దిగుమతి చేసుకుంటే 60 మధ్యప్రాచ్య దేశాల నుంచి 14 అమెరికా, 12 ఆఫ్రికా, ఐదు లాటిన్ అమెరికా, రెండు పీపాలు రష్యా నుంచి దిగుమతి ఉండేది.పశ్చిమ దేశాలు ప్రకటించిన ఆంక్షలను ఖాతరు చేయరాదని భారత్, చైనా మరికొన్ని దేశాలు నిర్ణయించాయి. ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా తమ ఇంధన భద్రతను తాము చూసుకోవాలని అందుకోసమే రష్యా నుంచి దిగుమతి చేసుకుంటామని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం క్రియాశీలత, వేగాన్ని ప్రదర్శించిందని ఆర్థికవేత్త అశోక్ గులాటీ వర్ణించారు. ఇంధన ధరలు అదుపు తప్పకుండా ఉండేందుకే కొనుగోలు అన్నారు. రష్యా ప్రతిపాదనను అంగీకరించకపోతే లీటరు పెట్రోలు రూ. 150 నుంచి 175కు పెరిగేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తెలివైన నిర్ణయం తీసుకుందని క్రిసిల్ ప్రధాన ఆర్థికవేత్త డికె జోషి చెప్పారు. ఇక కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రధాని రాజనీతిజ్ఞత, ధైర్యం కారణంగానే రష్యా నుంచి కొనుగోళ్లు పెంచినట్లు చెప్పారు. తమ ఆంక్షలను ధిక్కరించినా భారత్ మీద ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకోకూడదని పశ్చిమ దేశా లు నిర్ణయించాయి. దాంతో మన అవసరం వారికి ఉంది కనుకనే అమెరికా దిగివచ్చిందని, ఇదంతా నరేంద్ర మోడీకి ప్రపంచంలో ఉన్న పలుకుబడి, అమెరికా మెడలు వంచే సత్తా కలిగి ఉండటమే అని ప్రచారం చేశారు.ఒక వైపు రష్యా మీద ఆంక్షలు మరో వైపు అక్కడి నుంచి దిగుమతి చేసుకొని మరో దేశంలో ఉత్పత్తి చేస్తున్న చమురు ఉత్పత్తులను చౌకగా కొనుగోలు చేసి లబ్ధి పొందుతున్న పశ్చిమ దేశాల మోసకారితనం దాస్తే దాగేది కాదు. ఇదంతా నరేంద్ర మోడీ సర్కార్‌కు తెలియకుండా జరుగుతుందా? ఆంక్షలకు ముందు అమెరికా కంపెనీలు రష్యాలో ముడి చమురు నుంచి ఉత్పత్తి చేసే వర్జిన్ గాస్ ఆయిల్ (విజిఒ)ను దిగుమతి చేసుకొనేవి. ఇప్పుడు భారత్ నుంచి కొనుగోలు చేస్తున్నాయి. రష్యా నుంచి రిలయన్స్, నయారా ఎనర్జీ కంపెనీలు ముడి చమురు దిగుమతి చేసుకొని విజిఒ, ఇతర ఉత్పత్తులుగా మార్చి అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. రోజుకు రెండు లక్షల పీపాల ఎగుమతి జరుగుతున్నట్లు కెప్లర్ సంస్థలో ముడి చమురు విశ్లేషకుడిగా ఉన్న విక్టర్ కాటోనా చెప్పాడు. రష్యా చమురును పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నది ఆ రెండు కంపెనీలైనప్పటికీ ప్రభుత్వ రంగంలోని ఐఒసి, బిపి, హెచ్‌పి సంస్థలు కూడా పెద్ద ఎత్తున రంగంలోకి దిగుతున్నాయని, ప్రతివారూ కొంటున్నారు, ఇప్పుడిది ఒక జాతీయ క్రీడగా మారిందని కాటో నా అన్నాడు.ప్రస్తుతం రోజుకు మన దేశం 17 లక్షల పీపాలు కొనుగోలు చేస్తుండగా దానిలో ఒక్క రిలయన్స్ కంపెనీ రోజుకు ఆరు లక్షల పీపాలు దిగుమతి చేసుకుంటోంది. దాని చమురు శుద్ధి సామర్ధ్యంలో ఇది సగం. నయారా ఎనర్జీ ఇటీవల దాదాపుగా రష్యన్ చమురునే శుద్ధి చేస్తోంది. భారత్‌కు పీపాకు పది డాలర్ల చొప్పున తక్కువ ధరకు ఇస్తున్నందున ఇక్కడి చమురు శుద్ధి కంపెనీలకు ఒక టాంకరుకు కోటి డాలర్ల మేరకు లాభం వస్తున్నదని, ప్రస్తుతం భారత రేవులకు వచ్చినవి లేదా దారిలో ఉన్నవిగానీ 68 టాంకర్లు ఒక్క అమెరికా, బ్రిటన్ మాత్రమే దొడ్డిదారిన డీజిల్, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకోవటం లేదు. పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలలో ఎల్‌ఎన్‌జి లేకపోవటంతో ఐరోపా దేశాలు భారీ ఎత్తున రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. 2021 ఆగస్టుతో పోల్చితే 2022 ఆగస్టులో 41 శాతం ఎల్‌ఎన్‌జి దిగుమతి పెరిగింది. లేనట్లయితే ఇంధన ధరలు ఇంకా పెరిగి ఉండేవని లండన్‌లోని ఒక సంస్థ పేర్కొన్నది. ఫిబ్రవరి ఐదు నుంచి మరిన్ని ఆంక్షలు అమల్లోకి రానున్నందున అప్పుడేం జరుగుతుందో చూడాల్సి ఉంది. జర్మనీ పరిశోధనా సంస్థ జే రూపొందించిన సూచికల ప్రకారం 21 దేశాలలో జర్మనీ 18వ స్థానంలో ఉంది. గతంతో పోలిస్తే నాలుగు స్థానాలు దిగజారింది. ప్రభుత్వం 200 బిలియన్ యూరోల సబ్సిడీ ప్రకటన, 2024 వరకు గ్యాస్ ధరల అదుపు వంటి పథకాలను ప్రకటించినప్పటికీ ఇంధన ధరలు తక్కువగా ఉన్న అమెరికా, ఆసియా దేశాలకు జర్మనీ వ్యాపారులు వలస పోతున్నారు. గడచిన నాలుగు సంవత్సరాల సగటుతో పోల్చితే 2022లో జర్మనీలో 14 శాతం గ్యాస్ వినియోగం తగ్గింది. పారిశ్రామిక డిమాండ్ 15 శాతం పడిపోయింది. గతంలో వెనెజులాను సాధించేందుకు విధించిన ఆంక్షలను తన అవసరాల కోసం అమెరికా ఎత్తివేసింది. ఇప్పుడు దొడ్డిదారిన రష్యా నుంచి మన దేశం దిగుమతి చేసుకున్న చమురును శుద్ధి చేసిన తరువాత దొడ్డిదారిన దిగుమతి చేసుకుంటోంది.

# ఉద్యోగ సంఘాల మధ్య మాటల యుద్ధం

విజయవాడ, జనవరి 23, జీతాల కోసం, ప్రైవేటు ఉద్యోగులు వీధుల్లోకి వచ్చారంటే అర్థం చేసుకోవచ్చును. ఆందోళనకు దిగారంటే సరిపెట్టుకోవచ్చు. సమ్మెకు దిగారంటే ఔను మరేంచేస్తారని సమాధాన పడొచ్చు. కానీ, ప్రభుత్వ ఉద్యోగులు వీధుల్లోకి రావడం, ఆందోళనలకు దిగడం, సమ్మె చేయడం కాదు ఏకంగా గవర్నర్ ను కలిసి, ప్రతి నెలా ఫస్ట్ కు జీతాలు ఇప్పించండి మహా ప్రభో అని మొరపెట్టుకోవడం బహుశా దేశ చరిత్రలో ఇదే మొదటి సారి కావచ్చు. ఆ మొదటి గౌరవం ఆంధ్రప్రదేశ్ కే దక్కింది. ఇప్పటికే అక్షర క్రమంలో కాదు అప్పుల్లో కూడా ఏపీయే ఫస్ట్ అనిపించుకున్న ఏపీ ఇప్పుడు.. ఉద్యోగులే జగన్ ప్రభుత్వంపై గవర్నర్ కు ఫిర్యాదు చేసి.. గౌరవ ముఖ్యమంత్రి నిర్వాకం ఎలా ఉందో యావద్దేశానికీ చాటారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రభత్వ ఉద్యోగులు రాష్ట్ర గవర్నర్ కు ఫిర్యాదు చేయడం ఏదైతే వుందో అది నభూతో న భవిష్యతి.. అన దగిన అద్భుత సన్నివేశం. ఇటువంటి ఘటన అంటే ప్రభుత్వోద్యోగులు జీతాలకోసం గవర్నర్ ని కలవడం అనేది దేశచరిత్రలో గతంలో ఎన్నడూ జరగలేదు.. భవిష్యత్తులో జరిగే అవకాశం లేదు. ఔను భవిష్యత్ లో జరిగే అవకాశం లేదని ఉద్యోగులే చెబుతున్నారు. ఎందుకంటే జగన్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాదు కనుక అంటున్నారు. మరే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంతటి అధ్వాన పాలన చేయడం జగన్ కు వినా మరెవరికీ సాధ్యం అయ్యే పని కాదని వారు అంటున్నారు. సరే ఉద్యోగులు గవర్నర్ ను కలిసి ప్రభుత్వంపై ఫిర్యాదు ఇచ్చిన ఘటన ఉద్యోగ సంఘాల మధ్య చీలికకు కారణమైందంటే అదే వేరే విషయం. ఉద్యోగసంఘం నేతలు రాష్ట్ర గవర్నర్ ని కలవడం, రాష్ట్ర ఆర్థికపరిస్థితి దిగజారిందనడానికి నిదర్శనం. ప్రతినెలా 1వ తేదీన జీతాలు ఇప్పించాలని, రిటైరైన ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇప్పించాలని ఉద్యోగసంఘాలు గవర్నర్ ని కోరాయి. ఉద్యోగ సంఘాలు గవర్నర్ ని కలవడం అనేది సాధారణమే. కానీ జీతాల కోసం గవర్నర్ ని కలవడం దేశంలో ఇదే తొలిసారి. ప్రభుత్వం స్పందించకుంటే ఏప్రిల్ లో సమ్మె చేస్తామన్నారు. జనవరి జీతాలు ఫిబ్రవరి నెల్లో కూడా ఇవ్వలేమని, ఇప్పటికే ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు.అప్పులు పుడితేనే ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇస్తోంది. రాష్ట్రంలో ఆర్థిక అత్యవసర పరిస్థితి ఉంది. అధికారికంగా ప్రకటించలేదు కానీ.. జీతాల కోసం ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వాన్ని కాకుండా గవర్నర్ ను ఆశ్రయించి గోడు వినిపించుకునే పరిస్థితి వచ్చిందంటే ఫైనాన్షియల్ ఎమర్జెన్సీ అని కాక ఇంకేం అనాలి. ఇప్పటికే 7 వేల కోట్ల డీఏలు ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంది. గతంలో పీఆర్సీ సందర్భంలో ఉద్యోగులకు రూ.2,500కోట్లు ఇవ్వాల్సి ఉందని, మార్చి 2022 నాటికి ఇస్తామని ప్రభుత్వమే చెప్పింది. ఇప్పటికీ ఆ బకాయిలు ఇవ్వలేదు. జీపీఎఫ్ అడ్వా న్స్ లు కూడా ఇవ్వని ప్రభుత్వం, వాటినికూడా వాడుకుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.480 కోట్లు వాడుకుందని కేంద్రమే చెప్పింది.ఈ ప్రభుత్వానికి హక్కులపై ఉన్న అవగాహన బాధ్యతలపై లేదు. అలవెన్సుల విషయంలో పోలీస్ శాఖ కన్నీళ్లు పెట్టుకుంటోంది. చాలా మంది పోలీసు లు వారి జీతాల్లో 25శాతం సొమ్మును టీ.ఏ, డీ.ఏలకు ఖర్చుపెడుతున్నారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులకు ఏడుపే మిగిల్చింది. గత ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి 50 జీవోలు ఇచ్చింది. ఉద్యోగాల భర్తీ, పీఆర్సీ, ఇతర త్రా ప్రయోజనాలన్నీ నెరవేర్చింది..ప్రభుత్వ ఆసుపత్రుల్లో భోజనం పెట్టేవారికి బిల్లులు చెల్లించడంలేదు, ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వడంలేదు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పని చేసిన వైద్యులు, నర్సులకు హై కోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప, ప్రభుత్వం జీతాలు ఇవ్వలేదు. ఆప్కాస్ లోని లక్షమంది ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఈ ప్రభుత్వం ఏనాడూ కరెక్ట్ గా జీతాలు ఇవ్వలేదు? ప్రభుత్వం చేయాల్సింది సకాలంలో జీతాలు, ఇతరత్రా ప్రయోజ నాలు ఉద్యోగులకు కల్పించడం. ఆ పని చేయని ప్రభుత్వం.. మాట్లాడితే కేసులంటూ, ఉద్యమం చేస్తామంటే నిర్బంధాన్ని ప్రయోగిస్తుంటే.. ఉద్యోగులు గవర్నర్ ను కలవకుండా ఇంకేం చేస్తారు. గవర్నర్ ను కలిసి ఫిర్యాదు చేయడాన్ని ప్రశ్నిస్తున్న ఉద్యోగ నేత.. ఉద్యోగులకు కాకుండా జగన్ కు ప్రతినిథిగా వ్యవహరిస్తున్నారనే చెప్పాలి. మొత్తంగా ఉద్యోగ సంఘాల నేతల మధ్య ఇప్పుడు జరుగుతున్న మాటల యుద్ధం ఒక విధంగా ఉద్యోగులు సమస్యలపై నిరసన గళం విప్పకుండా అడ్డుకుంటూ పరోక్షంగా ప్రభుత్వానికి సహకరిస్తోందనడంలోసందేహం లేదు.

## రామచంద్రయాదవ్ కు వై కేటగిరి

తిరుపతి, జనవరి 23, ఏపీ యువ నాయకుడు ః. రామచంద్ర యాదవ్ కు కేంద్ర ప్రభుత్వం అరుదైన జ+ కేటగిరి భద్రత కల్పించింది. చిత్తూరు జిల్లా, పుంగనూరుకు చెందిన జనసేన నేత రామచంద్ర యాదవ్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తూ, సేవా కార్యక్రమాలు చేపట్టడాన్ని ఓర్వలేక అధికార పార్టీ నాయకులు పోలీసులు, రెవెన్యూ అధికారుల ద్వారా అడ్డుకోవడం జరుగుతోందని రామచంద్ర యాదవ్ ఆరోపించారు. తన పోరాటాన్ని అడ్డుకోవడంతో పాటు అక్రమ కేసులను మంత్రి పెద్దిరెడ్డి పెట్టిస్తున్నారని చెప్పారు. ఆర్డీవో అధికారులు, పోలీసుల సాయంతో మంత్రి పెద్దిరెడ్డి తనపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. కుటుంబానికి ప్రాణహాని ఉందని పదే పదే ఆరోపించిన రామచంద్ర యాదవ్ కేంద్రానికి ఈ విషయం తెలపగా తనకు జ+ కేటగిరి భద్రత కల్పించారని స్పష్టం చేశారు. 2022 డిసెంబర్ 4వ తేదీ వివిధ రంగాల రైతులకు జరుగుతున్న అన్యాయాలు, దోపిడీలు, సమస్యలపై సదుంలో రైతుభేరి బహిరంగసభ నిర్వహించకుండా పోలీసులు వివిధ కారణాలు చూపుతూ అడ్డుకున్నారు. పుంగనూరులో ఆర్సీవై మెగా జాబ్ మేళా ద్వారా 10 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా పోలీసులు అడ్డుకోవడం, రైతు భేరిని అడ్డుకోవడం అలాంటి అనేక సంఘటనలు జరిగాయని ఓ వీడియో విడుదల చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరులో అంబేద్కర్ రాజ్యాంగం అమలు చేయకుండా ఆయన రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, ప్రజలు, రైతుల సమస్యలపై నిలదీస్తే పోలీసుల ద్వారా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వీటిపై మాట్లాడినందుకు తన ఇంటిపై మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు, వైసిపి కార్యకర్తలు 300 మంది దాడికి పాల్పడి తన కుటుంబంపై హత్యాయత్నానికి పాల్పడినట్లు ఈ నెల 11వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాని కలిసి వివరించానని చెప్పారు.పుంగనూరులో దౌర్జన్యాలు, ఇంటిపై దాడి, తమ కుటుంబంపై హత్యాయత్నంపై అమిత్ షా తన వద్ద సమాచారం ఉందని త్వరలోనే కేంద్ర బలగాలతో రక్షణ కల్పిస్తానని భరోసా ఇచ్చిన 10 రోజుల్లోనే హోంశాఖ ద్వారా జ+ కేటగిరి భద్రత మంజూరు చేసి పంపించారని తెలిపారు. తనకు భద్రత కల్పించిన కేంద్ర మంత్రి అమిత్ షాకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు రామచంద్ర యాదవ్. రాబోయే రోజుల్లో వైసీపీ నేతలు, మంత్రి పెద్దిరెడ్డి రాష్ట్రంలో చేస్తున్న అరాచకాలు, అవినీతిని అడ్డుకునేందుకు తన వంతు ప్రయత్నం కొనసాగిస్తానని రామచంద్ర యాదవ్ తెలిపారు.దేశంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు జ భద్రత కల్పిస్తుంది.

# పులివెందుల టచ్ చేయకుండా పాదయాత్ర

గుంటూరు, జనవరి 23,టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర రూట్ మ్యాప్ ఖరారయింది. కుప్పం నియోజకవర్గంలో ఈ నెల 27న మొదలయ్యే పాదయాత్ర వంద నియోజకవర్గాల మీదుగా సాగనుంది. మొత్తం నాలుగు వందల రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుంది. మూడు రోజుల పాటు ప్రతి నియోజకవర్గంలో యాత్ర కొనసాగేలా టీడీపీ ప్లాన్ చేసింది. 25వ తేదీన కడప దర్గా, చర్చిలో ప్రార్థనలు చేసిన అనంతరం 26వ తేదీన తిరుమల శ్రీవారిని దర్శించుకుని 27వ తేదీన కుప్పం నుంచి తన పాదయాత్రను ప్రారంభిస్తారు. మూడు జిల్లాల్లో మొత్తం... చిత్తూరు జిల్లా నుంచి పాదయాత్ర ప్రారంభమై అనంతపురం, కర్నూలు, కడపల మీదుగా నెల్లూరు జిల్లాకు చేరుకుని అక్కడి నుంచి కోస్తాంధ్ర మీదగా ఉభయగోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్రలో ప్రవేశించి ఇచ్ఛాపురంలో ముగించనున్నారు. అయితే ముఖ్యమైన నియోజకరవర్గాల నుంచి ఈ పాదయాత్ర వెళ్లేలా ప్లాన్ చేశారు. టీడీపీ బలంగా ఉన్నా, బలహీనంగా ఉన్న నియోజకవర్గాలను కూడా టచ్ చేసేలా పాదయాత్ర రూట్ మ్యాప్ ను ఖరారు చేశారు. చంద్రబాబు సొంత జిల్లా అయిన పాత చిత్తూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి ఈ యాత్ర కవర్ అవుతుంది అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా పాదయాత్ర వెళ్లనుంది. కర్నూలు జిల్లాలోనూ అన్ని నియోజకవర్గాలను టచ్ చేసేలా పాదయాత్రను రూపొందించారు. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో మూడు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల నుంచి లోకేష్ పాదయాత్ర వెళ్లనుంది. కానీ కడప జిల్లాకు వచ్చే సరికి కొన్ని నియోజకవర్గాలకే పరిమితం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నుంచి మాత్రం పాదయాత్ర వెళ్లదు. కడప జిల్లాలో కేవలం ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప, బద్వేలు, కమలాపురం, రాజంపేటల మీదుగా పాదయాత్ర నెల్లూరుకు చేరుకోనుంది. పులివెందుల, జమ్మలమడుగు నియోజకవర్గాలను మాత్రం వదిలేశారు. దీనిపై పార్టీలో చర్చ జరుగుతుంది.అభ్యర్థుల ఖరారు దిశగా అడుగులునారా లోకేష్ పాదయాత్ర మరో ఐదు రోజులలో ప్రారంభకానుంది. చిత్తూరు జిల్లాలో ప్రారంభమై తొలి నెల రోజుల పాటు రాయలసీమ జిల్లాల్లోనే జరగనుంది. లోకేష్ పాదయాత్ర కంటే ముందుగానే కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసే అవకాశముందని తెలిసింది. టీడీపీ ఎన్నికల వ్యూహకర్త రాబిన్ శర్మ ఇచ్చిన సలహా మేరకు పాదయాత్ర పూర్తి స్థాయిలో సక్సెస్ కావాలంటే అభ్యర్థులను ముందుగానే డిసైడ్ చేయడం మంచిదని భావించి ఆ దిశగా నిర్ణయం తీసుకుంటున్నారు. కొందరు అభ్యర్థులను ఇప్పటికే చంద్రబాబు ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే అధికారికంగా ప్రకటించలేదు కాని అనధికారికంగా కొందరిని వారి నియోజకవర్గాల్లో పనిచేసుకోవాలని సూచించారని చెబుతున్నారు. లోకేష్ పాదయాత్ర దాదాపు వంద నియోజకవర్గాల్లో పర్యటించనుంది. అక్కడ పాదయాత్ర సజావుగా సాగాలన్నా, పార్టీ క్యాడర్ లో జోష్ పెరగాలన్నా పాదయాత్రకు ముందే అభ్యర్థులను ఖరారు చేయాల్సిన అవసరం ఉందని చంద్రబాబు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇందులో భాగంగా ఆయన గత కొద్ది రోజుల నుంచి నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేస్తున్నారు. ఇప్పటికే 150 నియోజకవర్గాలకు పైగా సమీక్షలు వాటిలో కొన్ని నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులకు చంద్రబాబు నుంచి టిక్కెట్ హామీ లభించిందని చెబుతున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో పొత్తులు ఉండటంతో కొన్ని చోట్ల మాత్రం వాటిని నిలిపేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. జనసేన, కమ్యునిస్టుల పార్టీలతో వచ్చే ఎన్నికల్లో టీడీపీ కలసి పనిచేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే వారు కోరుకునే నియోజకవర్గాలను ముందుగానే అంచనా వేసి వాటిని పక్కన పెట్టారంటున్నారు. లోకేష్ పర్యటించే వంద నియోజకవర్గాల్లో కొన్నింటిలో అవి కూడా ఉన్నప్పటికీ అక్కడ ఒకవేళ టిక్కెట్ రాకపోతే ఇన్‌ఛార్జిగా ఉన్న నేతకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారన్న హామీ కూడా ఉందట. లోకేష్ పాదయాత్రకు ఖర్చు మాత్రమే కాకుండా జనసమీకరణను కూడా చేయాల్సి ఉన్నందున చంద్రబాబు కొందరికి టిక్కెట్లను ఇప్పటికే కన్ఫర్మ్ చేశారని చెబుతున్నారు. ఎటూ ప్రస్తుతం సిట్టింగ్ లో ఉన్న వారందరికీ టిక్కెట్లను చంద్రబాబు అధికారికంగానే ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిలో కొందరు పార్టీని వీడటంతో వారిని మినహాయించి మిగిన వారందరికీ టిక్కెట్లు వచ్చే ఎన్నికల్లో ఇచ్చే అవకాశముంది. కొన్ని చోట్ల నియోజకవర్గాలను మార్చే అవకాశం కూడా ఉంది. లోకేష్ పాదయాత్ర ఆ నియోజకవర్గాల్లో ప్రవేశించే నాటికి అభ్యర్థి ఖరారవ్వాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారని చెబుతున్నారు. పాదయాత్ర సక్సెస్ అయ్యే బాధ్యతను కూడా వారిపైనే చంద్రబాబు పెట్టనున్నారని సమాచారం.

## పాదయాత్రను అడ్డుకోనే ప్రయత్నం జరుగుతోందా

తిరుపతి, జనవరి 23, తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ యువగళం పేరుతో కుప్పం నుంచి ఇచ్చాపురం వరకూ పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ పాదయాత్ర కోసం లోకేష్ ఆరు నెలలుగా కసరత్తు చేస్తున్నారు. ఇందు కోసంటీడీపీ మొత్తం యాక్టివ్ అయింది. రూట్ మ్యాప్ సహా.. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి అడ్డంకులు రావొచ్చు.. వాటిని ఎలా ఎదుర్కోవాలన్నదానిపై ముందస్తుగా కసరత్తు పూర్తి చేశారు. బ యటకు తెలియకయపోయినా యువ నేతలతో కమిటీలు ఏర్పాటు చేసుకుని ముందస్తు సన్నాహాలు కూడా పూర్తి చేసుకున్నారు. ఇరవై ఏడో తేదీన యాత్ర ప్రారంభం కానుంది. అయితే టీడీపీ మాత్రం.. లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడానికి వైఎస్ఆర్‌సీపీ అటు అధికారపక్షంతో పాటు ఇటు రాజకీయంగానూ ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తోంది. దీనికి పలు కారణాలను చూపిస్తోంది. లోకేష్ పాదయాత్ర చేయబోతున్నారని..ఆయనకు రాజకీయ ప్రత్యర్థులు, ఇతర సంఘ విద్రోహ శక్తుల నుంచి ముప్పు పొంచి ఉందని .. భద్రత కల్పించాలని రెండు వారాల కిందటే ఏపీ పోలీసులకు టీడీపీ నుంచి లేఖ వెళ్లింది. కానీ పోలీసులు స్పందించలేదు. రెండో సారి టీడీపీ రిమైండర్ పంపిన తర్వాత పోలీసుల నుంచి స్పందన వచ్చింది. పాదయాత్ర కు సంబంధించి డీటైల్స్.. ఎన్ని రోజులు నిర్వహిస్తారు.. ఏ రోజు ఏఎక్కడ పాదయాత్ర చేస్తారు.. ఎంత మంది పాల్గొంటారు అన్న వివరాలు ఇవ్వాలని కోరారు. దీనిపై టీడీపీ మళ్లీ సమాధానం పంపింది. అయితే అనుమతి ఇస్తారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. పాదయాత్రను అడ్డుకోవడానికే ఇలా చేస్తున్నారని టీడీపీ వర్గాలు మండిపడుతున్నాయి. ఇటీవల వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ వన్ లోకేష్ పాదయాత్ర జరగకుండా టార్గెట్ చేసి రిలీజ్ చేసిందేనని.. టీడీపీ వర్గాలంటున్నాయి. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను వైసీపీ భరించలేకపోతోందని అందుకే కట్టడి చేయాలనుకుంటోందని అంటున్నారు. ఆ జీవో విషయం ప్రస్తుతం హైకోర్టులో ఉంది. ఇప్పటికైతే స్టే ఇచ్చారు. స్టేను ఎత్తి వేయాలని జీవో అమలు చేసేలా అనుమతి ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకెళ్లింది. కానీ సుప్రీంకోర్టు హైకోర్టులో తేల్చుకోవాలని సూచించింది. 23వ తేదీన విచారణ జరగనుంది. ఇప్పటికే అమరావతి రైతుల పాదయాత్ర విషయంలో హైకోర్టు పెట్టిన ఆంక్షల కారణంగా ఆ పాదయాత్రను రైతులు ఆపేయాల్సి వచ్చింది. ఏ చిన్న ఆంక్షలు పెట్టినా పోలీసులు విశ్వరూపం చూపిస్తారని టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. వైపు కుప్పంలో లోకేష్ పాదయాత్ర రోజున ఆయనను అడ్డుకుందామని.. దాడులు చేద్దామని.. వైఎస్ఆర్‌సీపీ తరపున కొంత మంది నేతలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గం శాంతి పురం మండలం ఎంపీపీ కోదండరెడ్డి ఇచ్చిన ఈ పిలుపు సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై టీడీపీ నేతలు సోషల్ మీడియాలో పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పర్యటనల్లో ఉద్రిక్తలు సృష్టించి.. పాదయాత్రను నిలిపివేసే కుట్ర చేస్తున్నారని టీడీపీ నేతలంటున్నారు.

# అచ్చెన్న వర్సెస్ అయ్యన్న...




శ్రీకాకుళం , జనవరి 23, ఎక్కడైనా.. ఏ రాష్ట్రమైనా.. హోం మంత్రులకు అంత సీనుందా? ఇప్పుడు అందరి నోటా ఇదే ప్రశ్న. నో ఆన్సర్. ఎందుకంటే ఏ ప్రభుత్వంలోనైనా, ఏ రాష్ట్రంలోనైనా హోంమంత్రులకు అంత సీన్ లేదన్నది అందరికీ తెలుసు. కానీ హోం మంత్రి పదవి కోసం మాత్రం పోటీ పడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హోంమంత్రి పదవి కావాలనిపిస్తుంది. కానీ అదే అధికారపార్టీలో ఉంటే దానంత వేస్ట్ పదవి మరొకటి ఉండదని ఆ పదవిని అనుభవించిన వారు అందరూ అంగీకరిస్తారు. ఎందుకంటే వారికి అధికారాలుండవు. ఆదేశాలు ఇచ్చే అవకాశముండదు. ప్రొటోకాల్ మినహా మరి ఏ ఇతర అధికారాలు ఉండవు. అది తెలంగాణ అయినా... ఆంధ్రప్రదేశ్ అయినా.. మరే రాష్ట్రమయినా అంతే. బదిలీల నుంచి నియామకాల వరకూ అంతా ముఖ్యమంత్రి కార్యాలయమే చూసుకుంటుంది.హోంమంత్రి ఎవరున్నా నామమాత్రమే. సంతకం పెట్టడానికే తప్ప మరి దేనికీ ఉపయోగపడరు. తాజాగా ఆంధ్రప్రదేశ్ లో హోంమంత్రి పదవి కావాలని ఇద్దరు పోటీ పడుతున్నారు. ఒకరు అచ్చెన్నాయుడు. మరోనేత అయ్యన్న పాత్రుడు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే తాము హోం మంత్రి అయిపోతామని, ఇప్పుడు వైసీపీకి కొమ్ముకాస్తున్న పోలీసులకు తగిన బుద్ధి చెబుతామని, వెంటాడి.. వేటాడుతామని చెబుతూ ఒకటే హోరెత్తిస్తున్నారు. ఆ మధ్య ఈఎస్ఐ స్కామ్ లో అరెస్టయినప్పుడు అచ్చెన్నాయుడు కూడా ఇదే రకమైన కామెంట్స్ చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందని, అధికారంలోకి రాగానే చంద్రబాబును అడిగి హోంమంత్రి పదవిని తీసుకుని మరీ పోలీసులపై పగ తీర్చుకుంటానని శపథం చేశారు.. ఇక అయ్యన్న పాత్రుడు ఇంకో అడుగు ముందుకేశారు. తొమ్మిది నెలల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వచ్చిన వెంటనే తాను హోంమంత్రితో పాటు లా అండ్ ఆర్డర్ పదవిని కూడా తీసుకుని వైసీపీకి వత్తాసుపలుకుతున్న పోలీసులను వెంటాడతానని హెచ్చరించారు. అధికారంలోకి రాగానే తమకు హోంమంత్రి పదవి కావాలని ఇద్దరు సీనియర్ నేతలు పట్టుబడుతుండటంపై పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. నిజంగా అన్నారా? లేక కార్యకర్తల్లో జోష్ నింపడానికి అన్నారా? అన్నది తెలియకున్నా వారి వ్యాఖ్యలు మాత్రం వైరల్ అవుతున్నాయి.నిజంగానే టీడీపీ అధికారంలోకి వస్తే ఈ ఇద్దరికీ హోంమంత్రి పదవి దక్కుతుందా? అంటే లేదనే చెప్పాలి. నోరున్నోళ్లకు ఆ పదవి ఎవరూ ఇవ్వరు. అచ్చెన్న, అయ్యన ఇద్దరూ నోరు, పట్టున్న నేతలు. వారికి హోంమంత్రి పదవి దక్కే అవకాశం లేదు. ఎవరో ఒకరు సామాజికవర్గం పరంగా తమకు నమ్మకైన వారినే తెచ్చి హోం మంత్రి పదవిలో కూర్చుండబెడతారు. మాట్లాడలేని నేతలనే ఆ పదవికి ఎంచుకుంటారు. అది చంద్రబాబు అయినా.. జగన్ అయినా కానీ అయ్యన్న, అచ్చెన్నలకు అంత రాజకీయ అనుభవం ఉన్నా తమకు మాత్రం హోంమంత్రి కావాలనడం అత్యాశ కాక మరేముంటుందన్న ప్రశ్నలు పార్టీ నుంచే వినిపిస్తున్నాయి

## యాదవులకు సముచిత స్థానం కల్పించాలి

- మణిగోపాల్ యాదవ్

తిరుపతి రాష్ట్రంలో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని అన్ని రాజకీయ పార్టిలను ఉద్దేశించి తీర్మానం చేసినట్లు, తిరుపతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రెస్పాన్సిబుల్ యాదవ్ జాయింట్ యాక్షన్ వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో తీర్మానించినట్లు చిత్తూరు, తిరుపతి బాలాజీ జిల్లాల నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మణి గోపాల్ యాదవ్ తెలిపారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల నుండి యాదవ కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు, యాదవ కులస్తులకు తగిన ప్రాధాన్యత లేదని చెబుతూ రాష్ట్ర జనాభాలో సుమారు 14 శాతం కలిగి ఉన్న యాదవ కులస్తులకు రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యత లభించడం లేదని, రాబోవు రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో కనీసం 25 అసెంబ్లీ స్థానాలు, 5 పార్లమెంటరీ స్థానాలకు యాదవ కులస్తులకు కేటాయించవలసిందిగా తీర్మానం చేసినట్లు మణిగోపాల్ యాదవ్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెస్పాన్సిబుల్ యాదవ్ జాయింట్ యాక్షన్ వెల్ఫేర్ సొసైటి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎ.బాలాజీ యాదవ్, సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు గాయత్రీ, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు యాదవ్, మంజుల, జయప్రకాష్ యాదవ్, బాలాజీ యాదవ్, చిత్తూరు తిరుపతి ఉమ్మడి జిల్లాల యాదవ నాయకులు పాల్గొన్నారు.

## డ్రోన్ వివాదం.. వైసీపీ వర్సెస్ బీజేపీ




తిరుమల, జనవరి 23,తిరుమల శ్రీవారి ఆలయ డ్రోన్ దృశ్యాల కేసులో కీలక అప్ డేట్ చోటు చేసుకుంది. ఈ దృశ్యాలు చిత్రించిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు పోలీసులు. ఆధ్యాత్మిక కేంద్ర తిరుమలపై డ్రోన్ ఎగరవేయడంపై నిషేధం ఉన్న నేపథ్యంలో ఇది శ్రీవారి ఆలయంపై చేస్తున్న దుష్ప్రచారమా– కుట్రకోణమా అనే కోణంలో విచారణ చేస్తున్నారు. మరోవైపు ఇదే విషయంపై అధికార పార్టీ వైసీపీ నేతలు.. బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం తిరుమల ఆలయంపై డ్రోన్లు ఎగరవేసేందుకు అనుమతుల్లేవు. అయినా సరే కిరణ్ అనే ఒక వ్యక్తి ఇక్కడ డ్రోన్ ఎగరవేసి.. ఆలయ దృశ్యాలు చిత్రంచడం పెను రాజకీయ వివాదంగా మారింది. వైసీపీ– బీజేపీ మధ్య పెద్ద మాటల యుద్ధమే నడుస్తోంది.ఒక దశలో ఇవి త్రీడీ ఇమేజ్ లేదా గూగుల్ లైవ్ వీడియో అయి ఉండొచ్చని భావించారు. టీటీడీపై బురద జల్లే యత్నమనీ ఆరోపించారు. ఈ దిశగా టీటీడీ ఒక ప్రకట కూడా రిలీజ్ చేసింది. వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపి పరిశీలిస్తామనీ అన్నారు టీటీడీ భద్రతాధికారులు. హైదరాబాద్ కు చెందిన కిరణ్ రెడ్డి అనే వ్యక్తి మొన్న ఇన్ స్టా గ్రామ్ లో ఈ వీడియో పోస్ట్ చేసినట్టు గుర్తించారు అధికారులు. గత నవంబర్ 13న అతడీ వీడియో అప్ లోడ్ చేశాడు. మొన్న ఇన్ స్టా నుంచి ఈ వీడియోను డిలీట్ చేశాడు. ఐకాన్ ఫ్యాక్ట్స్ అనే తన ఛానల్ నుంచి నిన్న డ్రోన్ షాట్స్ ను సైతం తొలగించాడు. అయితే ఇది దుష్ప్రచారమా– లేక కుట్ర కోణమా అనే అంశంపై తాము విచారణ జరుపుతామని అన్నారు టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి.శ్రీవారి ఆలయం ఒక మహిమాన్విత శక్తి క్షేత్రం. ఇక్కడ శ్రీవారు దివ్యశక్తితో ఉంటారు. అందుకే ఆలయంపై విమానాల ప్రయాణం లేదా మరేదైనా వస్తువు ఎగరవేయటం నిషిద్ధమని అన్నారు.ఇప్పటికే తిరుమలకు ఉగ్రవాదుల ముప్పు ఉందని నిఘా వర్గాలు పదే పదే హెచ్చరిస్తున్నారనీ. ఈఘటనకు కారకులైన వారి నుంచి.. నిర్లక్ష్యం వహించిన వారి వరకూ.. అందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు బీజేపీ నాయకులు. డ్రోన్ దృశ్యాల వెనకున్న శక్తులను బయట పెట్టాలని కోరుతున్నారు.ఇంతకీ ఈ దృశ్యాల చిత్రణ ఎలా జరిగిందని ఆరా తీసిన టీటీడీ అధికారులకు.. కొన్ని విషయాలు తెలిసాయి. గతేడాది కాకులకోనలో.. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వీడియోలను చిత్రీకరించేందుకు అనుమతించింది టీటీడీ. ఆ సమయంలో శ్రీవారి ఆలయ డ్రోన్ దృశ్యాలు చిత్రించాడీ డ్రోన్ ఆపరేటర్. ఇప్పుడీ వీడియోలు బయటకు రావడంతో ఇవి గ్రాఫిక్స్, గుగూల్ వీడియో కావని తేలడంతో చర్య తీసుకున్నారు పోలీసులు. శ్రీవారి ఆలయంపై డ్రోన్ దృశ్యాల వ్యవహారంపై కిరణ్ అనే వ్యక్తిపై ఎఖఅ సెక్షన్ 447 కింద కేసు నమోదు చేశారు అధికారులు

## డీజీపీపై మండిపడ్డ అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం ఏపీ డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాధ్ రెడ్డి పై టిడిపి అధ్యక్షులు అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసలు డిజిపి ఐపీఎస్ చదివారా లేక దొంగ సర్టిఫికెట్లు తో వచ్చారా అని ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరిగిన లోకేష్ జన్మదిన వేడుకల్లో అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. రేపు అధికారంలోకి వచ్చేది టిడిపి అని స్పష్టం చేశారు. అనుమతి ఇచ్చిన ఇవ్వకపోయినా ప్రజాస్వామ్యబద్ధంగా యువగళం పాదయాత్ర నిర్వహించి తీరుతామన్నారు. లోకేష్ పాదయాత్ర నిర్ణయంతో వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కొంతమంది మంత్రులు ముఖ్యమంత్రికి చెంచాగాళ్ళు గా తయారయ్యారని ఆరోపించారు. గతంలో అనేకమంది సిఎంలుగా పనిచేశారని,జగన్ లాంటి సైకో ముఖ్యమంత్రిని ఇంతవరకూ చూడలేదన్నారు...

## జనసేన నేత అరెస్టు

సత్తెనపల్లి పల్నాడు జిల్లా సత్తెనపల్లి లో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర రావును పోలీసులు అరెస్ట్ చేసారు. సోమవారం ఉదయం పోలీసులు జనసేన కార్యాలయాన్ని ముట్టడించారు. ఉదయం జనసేన నాయకులు అచ్చంపేట మండలం ఇసుక ల పరిశీలనకు బయలుదేరారు. వారికి అనుమతి లేదంటు సత్తెనపల్లి పోలీసులు అడ్డుకున్నారు. గాదె వెంకటేశ్వరరావు ను స్టేషన్ కు తరలించారు. గాదె అరెస్ట్ తో జనసేన కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు...

## తహసీల్దార్ ఆఫీసు ముందు ఆత్మహత్యాయత్నం

నెల్లూరు నెల్లూరు జిల్లా మర్రిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యక్తి ఆత్మహత్య యత్నంచేసాడు. మహబూబ్ బాషా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసాడు. ప్రభుత్వం తనకిచ్చిన భూమిని వైసీపీ నేతలు ఆక్రమించారని ఫిర్యాదు చేసాడు. ఉన్నతాధికారులు ఆదేశించినా తహశీల్దార్ పట్టించుకోవడం లేదని ఆరోపణ తనపై అక్రమంగా అట్రాసిటీ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేసాడు.

## మంగళగిరి ఎయిమ్స్ లో మరిన్ని సౌకర్యాలు

మంగళగిరి కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పరివార్ గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, పానకాల నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు.గుంటూరు జిల్లా పార్లమెంట్ ప్రభాస్ యోజన కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే ప్రసిద్ధిగాంచిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్ పై పలు ఫిర్యాదులు వచ్చా యని తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్ లో మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందాల్సిన ప్రాంతంలో సమస్యలు రావడం విచారకరమని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నా రు. ప్రధానమంత్రి ఆరోగ్య యోజన పథకం దేశంలో అనేకమందికి వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు.

# తిరుమలలో యాంటీ డ్రోన్ సిస్టమ్ తీసుకొని వస్తున్నాం

తిరుమల ఒక లక్ష రూపాయల విరాళాలు ఇచ్చే భక్తులు తక్కువ ఉన్నారు. ఒక లక్ష రూపాయలు విరాళం ఇచ్చిన భక్తులకు దర్శనం,గదులు ఇచ్చే వెసులు బాటు ఉండేదని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. సోమవారం అయన మీడియాతో మాట్లాడారు. 10 వేలు విరాళం ఇచ్చిన భక్తులకు ఒకసారి బ్రేక్ దర్శనం ఇచ్చే పద్ధతి తీసుకొని వచ్చాం. దాదాపు 650 కోట్ల నిధులు సమకురింది. ఈ నిధులతో 26 జిల్లాలతో పాటు 2068 ఆలయాల నిర్మాణ జాబితాలో ఉంది. సమరత సంస్థ ఫౌండేషన్ ద్వారా ఈ ఆలయాల నిర్మాణం పనులు జరుగుతుంది. 111 ఆలయాలు పూర్తి స్థాయిలో పనులు పూర్తి అయ్యాయి. 320 ఆలయాలకు 32 కోట్ల వ్యయం వెచ్చిస్తున్నాం. దేవాదాయ శాఖ ద్వారా 932 ఆలయాలకు 100 కోట్లు. పురాతన 150 ఆలయాలకు జీర్ణద్ధరణ ద్వారా 130 కోట్లు ఇచ్చాం. ఆరు నెలల్లో అన్ని ఆలయాలను పూర్తి చేస్తాం. గదులపై 71.41 కోట్లు ఆదాయం వచ్చాయి. తితిదే ఆధ్వర్యంలో 396 కళ్యాణ మండపాలు ఉన్నాం. తిరుపతిలో శ్రీనివాస కళ్యాణ మండపాల్లో ఉన్న బ్లాక్ లు మాత్రమే మరమ్మతులు చేశాం. అది కూడా స్థానికుల కోరిక మేరకే ఎసీలు కల్పించాం. మిగతా 384 కళ్యాణ మండపాల ధరలను పెంచలేదు. తిరుమలలో 850 గదులు తితిదే సిబ్బంది ఆధ్వర్యంలో ఉండేదని అన్నారు.వాటిలో 650 గదులను లాకొని సామాన్య భక్తులకు అందుబాటులోకి తెచ్చాం. ప్రతి ఆలయ కమిటీలో తితిదే లోని డిడిపి,సిబ్బంది ఉంటారు. శ్రీవాణి ట్రస్టు సంబంధించి ఒక వేయి టికెట్లు ఇస్తున్నాం. టూరిజం సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శన ఐదు వేల టికెట్లు ఇస్తున్నాం. డ్రోన్ సంబంధించి ఐటిసి కి పెర్మిషన్ ఇవ్వడం వాస్తవమే. వచ్చిన సిబ్బంది అత్యుత్సాహంతో ఆలయాన్ని డ్రోన్ తో చిత్రీకరించారు. వారి పై కేసు నమోదు చేశాం. దాని పై దర్యాప్తు కొనసాగుతుంది. యూట్యూబ్ లో ఉన్న వీడియోను తొలగించాం. తిరుమలలో యాంటీ డ్రోన్ సిస్టమ్ తీసుకొని వస్తున్నామని అయన అన్నారు.

# 5వ తేదీ నాటికే సగం జీతాలు ఇచ్చేస్తున్నాం

విజయవాడ, జనవరి 23, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించడం లేదంటూ జోరుగా ప్రచారం కొనసాగుతోంది. దీనిపై సోషల్ మీడియాలో పలు రకాలుగా విమర్శలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగుల సంక్షేమం, జీతాలు, పెన్షనర్ల చెల్లింపులో జాప్యం అంటూ జరుగుతున్న ప్రచారంపై ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సర్కార్ స్పందించింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల్లో 90 నుంచి 95 శాతం మందికి 5వ తేదీలోపే జీతాలను అందిస్తున్నట్లు వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులను మానవ వనరులుగా భావిస్తున్నామని.. ఉద్యోగులే తమకు పెద్ద ఆస్తి అంటూ పేర్కొంది. రాష్ట్ర విభజన సమస్యలు, కోవిడ్ సంక్షోభం ఉన్నా జీతాలు, పెన్షన్లు ఆపలేదని స్పష్టంచేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రకటన విడుదల చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలను ఇందులో స్పష్టంగా వెల్లడించారు.రాష్ట్ర విభజన అనంతర సమస్యలు, కోవిడ్ పరిస్థితుల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రతి నెలా 5 తేదీన 90 నుంచి 95 శాతం ఉద్యోగుల జీతాలు, పెన్షన్లను ప్రభుత్వం చెల్లిస్తున్నట్టు దానిలో వివరించారు. మిగిలిన 5 శాతం మందికి ఖజానాలో బిల్లులు సమర్పించిన తేదీకి అనుగుణంగా చెల్లింపులు జరుగుతున్నట్లు తెలిపారు. ఉద్యోగుల జీతాల బిల్లులు ఖజానా అధికారులకు నెలాఖరులోగా సమర్పించగలిగితే ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇవ్వగలమని పేర్కొన్నారు.ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల బిల్లులు 90 నుంచి 95 శాతం వరకు నెలాఖరు రోజున ఖజానా అధికారులు పాస్ చేస్తారని..

వాటి చెల్లింపులు ఆ మరుసటి నెల 5వ తేదీలోగా పూర్తిచేస్తున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న పలు పరిస్థితుల ఆధారంగా ఈ చెల్లింపులు కొనసాగుతున్నాయన్నారు. గతంలో పద్ధతి మాదిరిగానే ఇప్పుడు కూడా ప్రక్రియ కొనసాగుతుందని.. ఇలాంటి ప్రచారాలను, ఆరోపణలను నమ్మాల్సిన పనిలేదని స్పష్టంచేశారు.అవాస్తవ ప్రచారాలను నమ్మొద్దంటూ ప్రభుత్వం సూచించింది. వాస్తవాలు లేకుండా ప్రచురితమైన వార్తలు, పరువు నష్టం కలిగించే విధంగా చేస్తున్న ప్రచారాలపై ప్రభుత్వం చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఆలోచనలు చేస్తుందని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

# మీ గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదు

### ప్రభుత్వ సంఘానికి నోటీసులు

విజయవాడ, జనవరి 23, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో ఏడు రోజుల్లోగా తెలియచేయాలని నోటీసుల్లో జీఏడీ అధికారులు పేర్కొన్నారు. వేతనాలు, ఆర్థిక ప్రయోజనాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయటం రోసా నిబంధనలకు విరుద్ధమని నోటీసుల్లో స్పష్టం చేశారు. మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా నోటీసు జారీ చేసినట్టుగా ప్రభుత్వం పేర్కొంది. వేతనాలు, ఆర్థిక అంశాలపై ప్రభుత్వాన్ని సంప్రదించే మార్గం ఉందని ప్రభుత్వం తెలిపింది. ప్రత్యామ్నాయ మార్గాలున్నా గవర్నర్‌ను ఎందుకు కలిశారని ప్రశ్నించింది. వీరి సమాధానం తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను కలిశారు. జీతాలు, పెన్షనల చెల్లింపులో జాప్యం కారణంగా ఉద్యోగులు పడుతున్న ఆర్థిక బాధలను ఆయనకు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించడం లేదంటూ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఉద్యోగుల బకాయిలు తక్షణమే చెల్లించేందుకు గవర్నర్ చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం నేతలు తెలిపారు. ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వడంలో విఫలమైందని గవర్ర్ తో భేటీ తర్వాత సూర్యనారాయణ రాజ్ భవన్ ఎదుట ఆరోపణలు చేశారు. ఇవి సంచలనం సృష్టించాయి. అయితే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంపై ప్రభుత్వం స్పందించింది. 95 శాతం ఉద్యోగులకు ప్రతి నెలా 5వ తేదీలోపే జీతాలు చెల్లిస్తున్నామని ఆర్థిక శాఖ ప్రకటన విడుదల చేసింది.

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులను మానవ వనరులుగా భావిస్తున్నామని.. వారే తమకు పెద్ద ఆస్తి అని పేర్కొంది. రాష్ట్ర విభజన సమస్యలు, కోవిడ్ సంక్షోభం ఉన్నా జీతాలు, పెన్షన్లు ఆపలేదని తెలిపింది. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలను వివరించారు. ప్రతి నెలా 5 తేదీన 90 నుంచి 95 శాతం ఉద్యోగుల జీతాలు, పెన్షన్లను ప్రభుత్వం చెల్లిస్తున్నట్టుగా వెల్లడించారు. మిగిలిన 5 శాతం మందికి ఖజానాలో బిల్లులు సమర్పించిన తేదీకి అనుగుణంగా చెల్లింపులు జరుగుతున్నట్టుగా పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాల బిల్లులు ఖజానా అధికారులకు నెలాఖరులోగా సమర్పించగలిగితే ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇవ్వగలం అని తెలిపారు.ఉద్యోగ సంఘాల నేతలు గవర్నర్ కు ఫిర్యాదు చేసిన తర్వాత సూర్య నారాయణ చేసిన విమర్శలపై ఇతర ఉద్యోగ సంఘాలు మండిపడ్డాయి. ఏపీ ఎన్జీవో సంఘం సాధించిన కారుణ్య నియామకాల ఉత్తర్వుల వల్లే సూర్యనారాయణకు ఉద్యోగం వచ్చిందని ... సూర్యనారాయణ అధ్యక్షత వహిస్తున్న ఉద్యోగుల సంఘం గుర్తింపు రద్దు చేయాలని సీఎస్‌ను కోరతామని ఏపీఎన్జీవో అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ప్రకటించారు. సూర్యనారాయణ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను తాకట్టు పెట్టుతున్నారని ఆరోపించారు. బండి శ్రీనివాసరావుపై సూర్యనారాయణ కూడా విమర్శలు గుప్పించారు.

# యువగళం చుట్టూ రాజకీయం

విజయవాడ, జనవరి 23, 27వ తేదీ నుంచి నారా లోకేష్ ప్రారంభించబోతున్న యువగళం పాదయాత్ర విషయంలో ప్రభుత్వం, పోలీసులు కుట్రలు చేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇప్పటికీ అనుమతులు ఇవ్వకపోవడంపై మండి పడుతున్నారు. అనుమతి ఇచ్చినా ఇవ్వకపోయినా పాదయాత్ర జరిగి తీరుతుందంటున్నారు.ఈ నెల 27నుంచి రాష్ట్రంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభం కానుంది...40 రోజుల క్రితమే లోకేష్ పాదయాత్ర చేయనున్నట్లు పార్టీ వర్గాలు ప్రకటించాయి..రాష్ట్రంలో ఉన్న వివిధ వర్గాల ప్రజల సమస్యలను ఫోకస్ చేస్తూ పాదయాత్ర సాగనుందని తెలిపారు..పాదయాత్రకు యువగళం అన్న పేరును ఖరారు చేశారు. 400 రోజులు 4వేల కిలోమీటర్లు ఈ పాదయాత్ర సాగనుంది. జనవరి 27న కుప్పంలో ప్రారంభమయ్యే ఈ యువగళం పాదయాత్ర ఇచ్ఛాపురంలో పూర్తి అవుతోంది. పాదయాత్ర తేదీ దగ్గర పడటంతో నాయకులు క్యాడర్ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. పాదయాత్ర చేసుకొనేందుకు పోలీసుల పర్మిషన్ కోసం అప్లై చేసినా ఇంత వరకు ఇవ్వకపోవడంతో టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. .ప్రజాస్వామ్య యుతంగా చట్టానికి లోబడి పాదయాత్ర చేసుకుంటాము అంటే అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు అని ఆరోపిస్తున్నారు. పాదయాత్ర కు అనుమతి కావాలంటూ పోలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఈ నెల 9న ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి లేఖ రాసారు.. స్పందించక పోవడంతో రెండు సార్లు రిమైండర్ కూడా పంపారు. 21 వ తేదిన డీజీపీ స్పందిస్తూ ప్రత్యుత్తరం పంపారు . ఆ లేఖ చూచి టీడీపీ నాయకులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. నిబంధనల పేరుతో ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కేందుకు ప్రయత్నం జరుగుతోంది అంటూ ఏపీ డీజీపీ అధికార పార్టీ తొత్తుగా వ్యవహరిస్తున్నారు అంటూ తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పాదయాత్ర అనుమతి తరువాత ముందు ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు మాకు పంపాలి ఆ తర్వాత అనుమతి గురించి ఆలోచిస్తాం అంటూ డీజీపీ కార్యాలయం నుంచి లేఖ వచ్చింది. అందులో అడిగిన వివరాలు ప్రతిపక్షాల మనుగడకే ప్రమాదంగా ఉన్నాయని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. 400 రోజులపాటు లోకేష్ చేపట్టనున్న యువగళం పాదయాత్రకు సంబధించి డీజీపీ అడిగిన వివరాలు గతంలో, దేశంలో ఇప్పటి వరకు ఏ పోలీసు అధికారి పాదయాత్రల సమయంలో ఆడగలేదని అంటున్నారు. నాలుగు వందల రోజులకు సంబంధించి ప్రతి రోజు ఎవరెవరు పాదయాత్రలో పాల్గొంటారు..? లోకేష్ ను కలుసుకునే వ్యక్తుల వివరాలు వారి ఆధార్ కార్డు తో సహా సమర్పించాలి అని లేఖలో ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాదయాత్రలో ఉండే వాహన కాన్వాయ్ వివరాలు... వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్ తో సహ వివరాలు...రూట్ మ్యాప్ ఏ బజారు నుంచి ప్రారంభమై ఎక్కడ ఆ రోజు ముగుస్తోందో 400 రోజలకు సంబంధించిన వివరాలు... ఏ సమయంలో ఏ ప్రాంతంలో యాత్ర సాగుతోందో తేదీల వారిగా వివరాలు... ప్రతి రోజు బస చేసే ప్రాంతం ..ఎక్కడ నైట్ స్టే అవుతారో తెలియచేస్తూ స్థానికంగా ఆ బాధ్యతలు చూసే వారి ఫోన్ నెంబర్లు అందచేయాలని లేఖలో ప్రస్తావించారు. శనివారం సాయంత్రం మెసెంజర్ ద్వారా లేఖను వర్ల రామయ్య కు అందించి ఆదివారం ఉదయం 11 గంటలలోపు డీజీపీ కార్యాలయాలలో అటెండ్ అయి వివరాలు అందించాలని లేఖలో పేర్కొనడంతో ఒక రేంజ్ లో ఫైర్ అవుతున్నారు. రూట్ మ్యాప్, రోజు వారి పర్యటన వివరాలు స్థానిక డీఎస్పీ కి అందిస్తామని...ప్రతికూల వాతావరణం, ప్రజల నుంచి వచ్చే అభ్యర్థనలు కారణంగా షెడ్యూల్ లో మార్పులుంటాయని చెబుతున్నారు.. డీజీపీ బాధ్యత కలిగిన అధికారిగా ప్రవర్తించడం లేదని వైసీపీ పార్టీ కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని ఆంటున్నారు. ఈ లేఖ డీజీపీ కార్యాలయం నుంచి వచ్చినట్లు లేదని సకల శాఖా మంత్రి సజ్జల పంపినట్లు ఉందని ఆరోపిస్తున్నారు వర్ల రామయ్య.. పాదయాత్ర లో పాల్గొనే వారి పాన్ కార్డులు, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇవ్వడం సాధ్యమయ్యే పనేనా అని ప్రశ్నిస్తున్నారు. అధికారంలో వచ్చిన తర్వాత యువత సమస్యలను పరిష్కరిస్తాం అని చెప్పిన వైసీపీ ఆ తర్వాత వారిని విస్మరించిందని ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా యువతని టార్గెట్ చేసి వారి సమస్యలను తెలుసు కుంటూ పాదయాత్ర చేసేందుకు లోకేష్ సిద్దమయ్యారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఏదో ఒక విధంగా పాదయాత్ర జరగకుండా వైసీపీ ప్రభుత్వం పావులు కదుపుతోందని ఆరోపిస్తున్నారు టీడీపీ నాయకులు..ఎవరు ఎన్ని ఆంక్షలు పెట్టిన పాదయాత్ర ఆగదని, పోలీసుల ఆక్షలు ..అధికార పార్టీ బెదిరింపులుకు భయపడే పరిస్తితి లేదని అంటున్నారు టీడీపీ క్యాడర్.

## ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకోవాలి

### జీవన విధానంలో ఎప్పటికప్పుడు మార్పు దిశగా ప్రయాణించాలి

### డీసీపీ అడ్మిన్ అఖిల్ మహాజన్

రామగుండం : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మ్డ్ రిజర్వు సిబ్బందికి మొబైలేజేషన్ శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా డీసీపీ అడ్మిన్ అఖిల్ మహాజన్ హాజరు అయ్యారు. ముందుగా అయన సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. అఖిల్ మహాజన్ మాట్లాడుతూ... ఈ మొబైలేజేషన్ శిక్షణ కాలంలో ఫిజికల్ ఎక్సర్ సైజ్ ,యోగ, స్కాడ్ డ్రిల్ , ఆమ్స్ డ్రీల్, లాఠీ డ్రిల్, ఆయుధాల పై అవగాహన, ఫైరింగ్ ప్రాక్టీసు, ఫీల్డ్ క్రాఫ్ట్, మొదలగు వాటి పట్ల తర్ఫీదు ఇవ్వడం జరిగిందని, మహిళలపై జరిగే ఆగాయిత్యాల సమయంలో ఏవిధంగా ఆత్మరక్షణ చేసుకోవాలో శిక్షణ, ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు జరిగిన సమయం లో మాబ్ చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడే సమయం లో చేసే మాబ్ ఆపరేషన్ డ్రిల్, ప్రతిరోజు సాయంత్రం , స్పోర్ట్స్ తర్ఫీదు, సిబ్బంది ఎల్లప్పుడు ఫిజికల్ ఫిట్నెస్ గా ఉన్నప్పుడే చక్కగా విధులు నిర్వహిస్తారని, ప్రతి ఒక్కరికి విధి నిర్వహణలో భాగంగా శిక్షణలు తీసుకోవాలని, పి.ఎస్.ఓ(ఖూూ) లకు జనరల్ డ్యూటీ, గార్డ్ డ్యూటీ, సిబ్బంది యక్క స్కిల్స్ ప్రకారంగా డ్యూటీలు ఏర్పాటు చేయాలని, ప్రతిసారి అందరికీ డ్యూటీలు షిఫ్ట్ ల ప్రకారంగా అవకాశాలు ఇవ్వాలని, సిబ్బందికి ఒక్క దగ్గరనే విధులు కాకుండా, మరొక చోటుకు విధులకు పంపివాలనీ, క్రమశిక్షణకు అందరు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆమ్స్ డ్రిల్ చూసుకోవాలి, సిబ్బంది ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసికురావచ్చు అని, ఎవరూ కూడా పనిష్మెంట్ లకు అవకాశం ఇవ్వరాదని, ఎవరి డ్యూటీలు వారు చక్కగా క్రమశిక్షణ తో నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకోవాలని, తమ జీవన విధానంలో ఎప్పటికప్పుడు మార్పు దిశగా ప్రయాణించాలని సూచించారు. సమాజంలో పోలీసులకు మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ సుందర్ రావు, మల్లికార్జున్, రిజర్వ్ ఇన్స్పెక్టర్స్, మధుకర్, శ్రీధర్, విష్ణు ప్రసాద్, ఆర్ఎస్ఐ లు రాజేష్, ప్రవీణ్, అనిల్, విశ్వజా, శ్రావణి, అమిద బేగం, ఏఆర్ ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

రామడుగు రామడుగు మండలం చిప్పకుర్తి గ్రామంలో 20 లక్షలతో నిర్మించే నూతన గ్రామపంచాయతీ భవనానికి ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెల అభివృద్ధి ధ్యేయంగా టిఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుంద మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో పూడిక తీపించడం జరిగిందని నూతనగా ఏర్పడిన గ్రామాలకు గ్రామపంచాయతీ భవనాలను మంజూరు చేయడం జరిగిందని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంలో మంచినీటిని అందని గ్రామానికి అందిస్తామని అన్నారు. పల్లెలో పచ్చదనంతో ఉండేందుకు హరితహారం కార్యక్రమం పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయడం జరిగిందని కుల సంఘ భవనాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని రైతు వేదికలు స్మశాన వాటికలను నిర్మాణం చేసుకోవడం జరిగిందని అన్నారు. మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో ఆడబిడ్డలు మంగళహారతిలో ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ కు స్వాగతం పలికారు. తిరుమలాపూర్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ అర్హులైన వారందరికీ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, స్థానిక సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారాలోకేష్ బాబు 40 వ జన్మదినం వేడుకలు



పత్తికొండ :నూర్: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ. నారా లోకేష్ బాబు గ 40 వ జన్మదినం వేడుకలను పత్తికొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గ ముఖ్య నాయకులు మరియు నాయకులు,కార్యకర్తలకు ఘనంగా నిర్వహించడమైనది.తదనంతరం రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు,రాష్ట్ర బి సి సెల్ నాయకులు రామానాయుడు మాట్లాడుతూ ఈనెల 27 న ప్రారంభమయ్యే యువగలం కు అనుమతులు ఇవ్వకుండ అడ్డుపడతుంటే మీ వైఖరి ఏమిటి అన్నది అర్థం అవుతున్నది,రాష్ట్ర యువతలో లోకేష్ బాబు పై వస్తున్నా ఆదరణ చూసి భయపడి అడ్డుకోవాలని చూస్తున్నారు.మీ పార్టీ వాళ్ళు మీరు ఎన్ని కుట్రలు చేసిన పాదయాత్ర ఆగదు అని త్వరలో మా నాయకుడు శ్యామ్ బాబు నాయకత్వం లో పత్తికొండ నియోజవర్గం లో పాదయాత్ర మొదలుపెడతామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గం,జిల్లా కార్యవర్గం, నియోజకవర్గస్థాయి కార్యవర్గం మండల కార్యవర్గం, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించాలి

విజయవాడ దళిత జేఏసి, అమరావతి రైతులు ఆధ్వర్యంలో సి.ఆర్.డి.ఎ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించాలంటూ ప్రధాన ద్వారం వద్ద బైటాయించారు.దళిత జేఏసి నేతమార్టిన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి మమ్మలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అసైన్డ్ రైతులకు నేనున్నా అంటూనే... నేడు నట్టేట ముంచాడని ఆరో?పించారు. మూడేళ్లుగా అసైన్డ్ రైతులకు కౌలు ఇవ్వడం లేదు. కుటుంబాలను పోషించుకోవడం కష్టం గా ఉంది. అమరావతి లో అసైన్డ్ రైతుల ఆకలి కేకలు జగన్ కు పట్టవా?. సి.ఆర్.డి.ఎ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. సమావేశాల పేరుతో మమ్మలను తుళ్లూరు, విజయవాడ లకు తిప్పుతున్నారు. వెంటనే మా కౌలు చెల్లించేలా అధికారులు, ప్రభుత్వం స్పందించాలి. కూల్చడం తప్ప నిర్మించడం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చేతకాదు. గత ప్రభుత్వం పూర్తి చేసిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వాలని అన్నారు.

## నారా లోకేష్ పాదయాత్ర విజయం కావాలని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు...



బద్వేలు, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారు తలపెట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని ఆదివారం ఉదయం నెల్లూరు రోడ్డులోని ఫాతిమా చర్చిలో తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి యాదవ్ ఝాన్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు... వైకాపా పాలనలో విసిగిపోయిన ఆంధ్రదేశ ప్రజానీకం అభివృద్ధి,సంక్షేమం కొరకు,వారి సమస్యలు పరిష్కారం కొరకు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన పాదయాత్ర ఎలాంటి ఆటంకం లేకుండా విజయవంతంగా కావాలని శ్రీమతి ఝాన్సీ ఆకాంక్షించారు... ఈ పాదయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని లోకేష్ గారికి మద్దతు ప్రకటించాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు కార్యక్రమంలో తెదేపా లీగల్ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి గద్ద గుర్రప్ప,బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలవలి వేణుగోపాల్,తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి,తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలుమాచుపల్లి లక్ష్మీదేవి, సీరియర్ మహిళా నాయకురాళ్లు రాజేశ్వరి, లక్ష్మీదేవి,జిల్లా ఎసి సెల్ మాజీ అధ్యక్షులు ఈశ్వరయ్య,టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాసాపేట శివ, కోంకుల రవి

## ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

పెద్దపల్లి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని నేతాజీ విగ్రహానికి బీజేపీ నాయకులు గొట్టిముక్కల సురేష్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయంతేగాని వర్ధంతి లేని ఏకైక నాయకుడని కొనియాడారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన గొప్ప దేశభక్తుడని కీర్తించారు. తన ఆశయసిద్ధికోసం అజాద్ హింద్ ఫౌజ్ ను స్థాపించి భరతమాత ముద్దుబిడ్డగా చరిత్రలో నిలిచి పోయిన మహనీయుడన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రమోద్ రావు, తూముల శ్రీనివాస్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మోలుగురి రాజవీరు, మోర మనోహర్, మాజీ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ సయ్యద్ ఫయాస్, లింగంపల్లి కరుణాకర్, బాలసాని సతీష్, వునుకొండ తిరుపతి, వునుకొండ భూమయ్య, ఐద తిరుపతి, కల్వల శ్రీనివాస్, వేల్పుల రమేష్, మోసంపల్లి శ్రీధర్, నాయిని శ్రీనివాస్ రెడ్డి, బండి రాజేష్, గాదె రాజేష్, మేకల సతీష్, పెంచాల మల్లయ్య, మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

# నారాలోకేష్ పాదయాత్రను అడ్డుకునే శక్తి ఎవరికీ లేదు: టిడిపి



### కోట్ల క్యాంప్ ఆఫీసులోనారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ఎమ్మిగనూరు ,ఎమ్మిగనూరు పట్టణంలో ఈనెల 27న "యువ గళం" పేరుతో ... టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 400 రోజులు 4000 కి.మీ. చేపట్టిన పాదయాత్రను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేసి 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేస్తామని, నారా లోకేష్ పాదయాత్రను అడ్డుకునే శక్తి ఎవరికీ లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. మాజీ కేంద్రమంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు గౌ శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారి ఆదేశాల మేరకు సోమవారం స్థానిక కోట్ల క్యాంపు కార్యాలయము నందు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారి 40 వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా టిడిపి నేతలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ... చంద్రబాబు చేపట్టిన పర్యటనలకు ప్రజల బ్రహ్మరథం పట్టడాన్ని చూసి ఓర్వలేని ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ర్యాలీలు, రోడ్ షోలు నిషేధిస్తూ ... జీవో నెంబర్ 1 చీకటి జీవోలను తీసుకువచ్చారని మండిపడ్డారు. గతంలో జగన్ పాదయాత్ర చేసినప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు అడ్డుకోలేదు కదా! అని గుర్తు చేశారు.నారా లోకేష్ పాదయాత్ర పై ఇప్పటికే ప్రజలలో ఆసక్తి పెరిగిందని ఈ విషయాన్ని గమనించిన వైసీపీ ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టిందన్నారు. లోకేష్ పాదయాత్రకు ఎన్ని అడ్డంకులు అవరోధాలు ఎదురైనా ప్రజల పక్షాన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాక్షస పాలనను తరిమికొట్టేందుకు పాదయాత్ర చేసి తీరుతామని తెలిపారు. ఒకవేళ ప్రభుత్వం పాదయాత్రను అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో... తెలుగుదేశం పార్టీ నాయకులు కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరక్టర్ జి. అల్తాఫ్, ఆం. ప్ర. రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరక్టర్ ఉప్పర ఆంజనేయులు, మునిసిపల్ మాజీ కౌన్సిలర్, ఎమ్మిగనూరు మండల మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు, నందవరం మండల టిడిపి నాయకులు ముగతి వీరా రెడ్డి, తెలుగు మహిళా నాయకురాలు గోకారమ్మ, ఎమ్మిగనూరు టౌన్ వైడ్ యన్. టి. ఆర్, అండ్ యన్.బి.కె. ఫ్యాన్స్ సేవా సమితి ప్రెసిడెంట్ రోజా ఆర్ట్స్ ఉసేని, సప్లయర్స్ బంగారప్ప, రుద్రాక్షల రంగన్న,టిడిపి పట్టణ ముస్లిం మైనార్టీ నాయకులు మదిరె పీర్ భాష, మేటి వలి భాష, మహబూబ్ బాషా, ఆఫ్గన్ వలిభాష, యం.రోషన్, పట్టణ టిడిపి ఎస్సీ సెల్ నాయకులు దర్జీ మోషన్న, సాల్మన్, జలవాడి ఏసన్న, వన్నెల మోష,6 వ వార్డు శంకర్, ఎమ్మిగనూరు మండల టిడిపి నాయకులు మాసుమాన్ దొడ్డి శ్రీనివాసులు, మాధవ స్వామి, పార్లపల్లి నాయకులు పాప రాయుడు, లక్ష్మన్న, వీరశేఖర్, కె. తిమ్మాపురం నాయకులు ఉప్పర వీరేష్ , బీటీ చిన్న హనుమంతు, సోమప్ప, బిజీ గోపాల్, గుడికల్ నాయకులు కోలంట్ల నాగరాజు, కోలంట్ల వెంకటేష్, నడువులయ్య, మసీదుపురం బ్రహ్మయ్య, రాయచోటి మారెప్ప, గోనెగండ్ల మండల నాయకులు గంజహళ్లి పెద్ద లక్ష్మన్న, గంజాహళ్లి సుధాకర్ కోట్ల క్యాంపు ఆఫీస్ ఇన్చార్జిలు కొడిగంటి శంకరన్న, యన్. ఆదెన్న తదితరులు పాల్గొన్నారు .

## ప్రజల ఆదరాభిమానాలు పొందాలి : ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి"



ఎమ్మిగనూరు ,ఎమ్మిగనూరు పట్టణంలోని ఉప్పర(సగర) కళ్యాణ మండపంలో ఎమ్మిగనూరు మండల కొత్తగా నియమితులైన జగనన్న సచివాలయం కన్వీనర్లు సంయుక్త సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" గారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోపార్టీ కి సంబందించిన అన్ని రాజకీయ కార్యక్రమాలకు సచివాలయం కన్వనర్లు నేతృత్వం వహించాల్సింది ఉంటుంది. సచివాలయల పరిధిలోని గ్రామ/ వార్డు వాలంటీర్లను సంప్రదించి గృహ సారథులు నియమించాలి. వీరంతా కలసి పార్టీ బలోపేతానికై కృషి చేయాలని సూచించారు. వలంటీరర్లు, కన్వనర్లు, గృహ సారథులు ప్రజల కోసం పనిచేసి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. మళ్లీ వచ్చేది వైఎస్సార్సీపీ ప్రభుత్వమేనన్నారు. ఎవరికీ భయపడకుండా పనిచేయాలని సూచించారు. ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వనర్లు నియమించామని ఆదేవిధంగా ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు గృహసారథులను ఎంపిక చేసుకోవాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బిఆర్. బసిరెడ్డి, ఎంపీపీ కేశన్న, భీంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాద్యాక్షులు రియాజ్ ఆహ్మద్, మన్సూర్ బాషా, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జీవనోపాధి కి పెరటికోళ్లుసర్పంచ్ పాల్ దినకర్





కౌతాళం :మహిళా పొదుపు సంఘాల సభ్యులకు ప్రభుత్వం జీవనోపాధి కి పెరటికోళ్లు అందించటం జరిగిందని మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ పాల్ దినకర్ పేర్కొన్నారు. సోమవారం కౌతల మండలం శ్రీశక్తి మండల మహిళా సమైక్య వైకెపి కార్యాలయం నందు ఈరోజు పెరటి కోళ్ల పంపిణీ చేయడం జరిగింది.కౌతాళం మండలం కు 100 యూనిట్లు రాక అందులో హాల్వి లో 22 యూనిట్లు మరియు ఉరుకుంద గ్రామంలో 5 యూనిట్లు తీసుకోగా మిగతావి కౌతాళం లో మహిళా గ్రూపు సభ్యులకు అందజేస్తామని ఏపీఎం రాజశేఖర్ తెలిపారు. ఒక యూనిట్ ధర 3150 అని కావాల్సిన వారు పేరు నమోదు చేసుకుని జీవనోపాధి కి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ పాల దినకర్ హాజరయ్యారు. వారి చేతులు మీదుగా కోళ్లను అందజేశారు. ఏపీఎం .రాజశేఖర్ సిసి. బజారప్ప మండల సమైక్య అకౌంటెంట్ మంజునాథ్ వి.ఓ.ఎ అదెన్న,మల్లె ప్రభ, ఈరన్న మహిళలు పాల్గొన్నారు.

## మున్సిపల్ స్పందనకు మూడు అర్జీలు.

నంద్యాల :- వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందన ద్వారా ప్రజల నుంచి అందే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సకాలంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ సిబ్బందిని ఆదేశించారు . పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పట్టణంలో ఉన్న ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆయన వినతులు స్వీకరించారు. స్పందన లో వివిధ సెక్షన్ల అధికారులు ఉండి ఉంటే అక్కడికి అక్కడే పరిష్కారం అయ్యే దని ఆయన అన్నారు. కానీ సెక్షన్ల అధికారులు స్పందన కు ఎందుకు రావడం లేదని దీనిపై కమిషనర్ థు?ష్టి తీసుకు పోతానని ఆయన అన్నారు . టౌన్ ప్లానింగ్ కు సంబంధించి మూడు ఆర్జీలు అందాయని అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ వర ప్రసాద్ . సీనియర్ అసిస్టెంట్ వర్రా మద్దిలేటి. మాత్రమే పాల్గొన్నారు.

# వీరమల్లులో అట్టుడికించే ఆ రెండు పాత్రలు!



బాబి డియోల్- ఔరంగ జేబ్
నర్గీస్ ఫక్రీ రోల్ –ఔరంగజేబ్ సోదరి రోషనారా

టాలీవుడ్ అగ్ర హీరోలంతా పాన్ ఇండియా స్టార్ డమ్ పై కన్నేశారు. మెల్లిగా చాప కింద నీరులా హిందీ పరిశ్రమను చుట్టేయాలని పెద్ద ఎత్తుగడలతోనే ఉన్నారు. ప్రభాస్–చిరంజీవి–చరణ్– ఎన్టీఆర్ తర్వాత మహేష్– పవన్ కూడా రేసులో ఉన్నారు. మహేష్ ని రాజమౌళి పాన్ ఇండియా స్టార్ ని చేస్తుండగా.. పవన్ కల్యాణ్ ని క్రిష్ పాన్ ఇండియా హీరోగా నిలబెట్టాలని గట్టి పంతంతో ఉన్నాడు.పవన్ కోసం క్రిష్ ఎంపిక చేసుకున్న కథాంశం కాన్వాసు అతిభారీగా ఉండడంతో టాలీవుడ్ సహా అటు బాలీవుడ్ మీడియాలోను దీనిపై ఆసక్తి నెలకొంది. అయితే బాహుబలి తరహాలో లేదా సాహో – ఆర్.ఆర్.ఆర్ తరహాలో వీరమల్లు చిత్రానికి అనవసర హైప్–హంగు కనిపించడం లేదన్నది నిర్వివాదాంశం. హరిహర వీరమల్లు రాక కోసం పవర్ స్టార్ అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. అలాగే ఈ సినిమా నుంచి సరైన అప్ డేట్ లేక ఆవురావురుమంటున్నారు. అలాంటి వారి కోసమే ఈ ఛమక్కు లాంటి వార్త.వీరమల్లు గా ఈ చిత్రంలో పవన్ డ్యూయల్ షేడ్ ఉన్న పాత్రలో నటిస్తున్నారని ఇప్పటికే టాక్ ఉంది. అయితే వీరమల్లుతో ఔరంగజేబ్ (బాబి డియోల్) అతడి సోదరి రోషనారా ఎపిసోడ్స్ సినిమాకే హైలైట్ గా నిలుస్తాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. అందునా వీరమల్లు ఔరంగజేబు సోదరి రోషనారా(నర్గీస్ ఫక్రీ)తో రొమాన్స్ చేస్తాడని కూడా గుసగుస వినిపిస్తోంది.నిజానికి వీరమల్లు కథాంశంలో ఔరంగజేబు పాత్ర.. అతడి సోదరి రోషనారా పాత్ర చాలా కీలకమైనవి. ఈ రెండు పాత్రలతో ముడిపడిన ఎమోషన్ పరాకాష్ఠలో ఉంటుంది. ఇక క్రిష్ ఎంపిక చేసుకున్న ఈ కథాంశం నిజానికి ఎంతో ఆసక్తికరమైనది. ఉద్విగ్నతను పెంచేది అని హిస్టరీ పరిశోధకులు అంటున్నారు. ఈ సందర్భంగా ఔరంగజేబ్ అతడి సోదరి రోషనారా పాత్రల కథేమిటన్న వివరాల్లోకి వెళితే ఆసక్తికర విషయాలు తెలిసాయి.ఔరంగజేబు ఆఖరి మొఘల్ చక్రవర్తిగా 1658 నుంచి 1707 వరకు రాజ్యాన్ని పాలించాడు. ఈ ఆరవ మొఘల్ చక్రవర్తి భారత దేశాన్ని ఏలినవాళ్ళందిరిలోను అత్యంత వివాదాస్పదమైన క్రూరమైన రాజుగా పేరు తెచ్చుకున్నాడు. ఔరంగజేబు కాలంలో మొఘల్ సామ్రాజ్యం అత్యంత విస్తీర్ణం సాధించింది. ఔరంగజేబును ఆలంగిర్ అని కూడా పిలుస్తారు.ఔరంగజేబుకు అత్యంత ప్రియాతి ప్రియమైన సోదరి రోషనారా బేగం 3 సెప్టెంబరు 1617 – 11 సెప్టెంబరు 1671 కాలంలో జీవించి ఉంది. రోషనారా మొఘలు యువరాణి. షాజహాను చక్రవర్తి ఆయన భార్య ముంతాజు మహలు రెండవ కుమార్తె. రోషనారా తెలివైన రాకుమార్తె. ప్రతిభావంతురాలైన కవయిత్రి. ఆమె తన తమ్ముడు ఔరంగజేబు పక్షపాతి. 1657 లో షాజహాను అనారోగ్యం తరువాత జరిగిన వారసత్వ యుద్ధంలో ఆయనకు రోషనారా మద్దతు ఇచ్చింది. 1658 లో ఔరంగజేబు సింహాసనం అధిష్ఠించిన తరువాత రోషనారాకు ఆమె సోదరుడు పాద్షా బేగం బిరుదు ఇచ్చి మొఘలు సామ్రాజ్యం ప్రథమ మహిళగా గౌరవించాడుఈమె పేరున ఉత్తర ఢిల్లీలో రోషనారా బాగు పేరుతో ఒక ఉద్యానవనం నిర్మించాడు. ఈనాటి రోషనారా క్లబ్బు ఈ పార్కులో భాగంగా ఉన్నది. అయితే 'రోషనారా బాగు' ఉద్యానవనం పేరుతోనే రోషనారా పాపులరైంది. ఆహ్లాదకరమైన ఈ ఉద్యానవనం ప్రస్తుతం ఉత్తర ఢిల్లీలో ఉంది. 19 వ శతాబ్దంలో బ్రిటిష ప్రభుత్వం నిర్మించిన కంట్రీ క్లబ్బు వాస్తవంగా రోషనారాబాగులో ఒక భాగంగా ఉంది.రోషనారా నలుగురు సోదరులలో పెద్దవాడైన దారా షికో చక్రవర్తి షాజహానుకు అభిమాన కుమారుడుగా ప్రత్యేకత పొంది నెమలి సింహాసనం వారసుడయ్యాడు. రెండవ కుమారుడు బెంగాలు రాజప్రతినిధి షా షుజా తన తండ్రి సింహాసనం మీద బహిరంగ తిగుబాటు చేయడానికి ప్రణాళిక వేసాడు. మూడవ కుమారుడు ఔరంగజేబు దక్కను రాజప్రతినిధిగా ప్రతిపాదించబడ్డాడు. చిన్న కుమారుడు మురాదుకు గుజరాతు రాజప్రతినిధి పదవి లభించింది. ఈ స్థానంలో ఆయన చాలా బలహీనుడని పనికిరానివాడని నిరూపించాడు. షాజహాను ఆయన బిరుదులను తొలగించి దారా షికోకు ఇచ్చాడు. ఇది షాజహాను ఆయన చిన్న కుమారులు మధ్య కుటుంబ పోరాటానికి దారితీసింది. వారు వృద్ధాప్య చక్రవర్తిని పదవీచ్యుతుని చేసి తమ కోసం సింహాసనాన్ని స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించుకుని తిరుగుబాటు చేస్తారు. ఈ బలపోరాటంలో దారా షికో తన పెద్ద సోదరి జహానారా బేగం మద్దతును పొందగా రోషనారా బేగం బదులుగా ఔరంగజేబుకు అండగా నిలిచింది.ఔరంగజేబును చంపడానికి షాజహాను- దారా షికో చేసిన కుట్ర విఫలమైన క్రమంలో రోషనారా అధికారంలో బలం పుంజుకుంటుంది. కుటుంబ సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించడానికి షాజహాను ఢిల్లీ సందర్శించడానికి ఔరంగజేబుకు ఆహ్వాన లేఖ పంపాడు. షాజహాను తన మూడవ కొడుకును సింహాసనానికి తీవ్రమైన ముప్పుగా భావించినందున ఔరంగాజేబును పట్టుకుని జైలులో పెట్టడానికి చంపడానికి ప్రణాళిక వేశాడు. రోషనారాకు తన తండ్రి కుట్ర గురించి తెలియగానే ఆమె ఔరంగజేబుకు ఒక దూతను పంపించి వారి తండ్రి నిజమైన ఉద్దేశాలను తెలియజేసింది. ఔరంగజేబును ఢిల్లీకి దూరంగా ఉండమని హెచ్చరించింది.సమయానుకూల హెచ్చరికకు రోషనారాకు ఔరంగజేబు చాలా కృతజ్ఞతలు తెలిపారు. ఔరంగజేబుకు అనుకూలంగా వారసత్వ యుద్ధం పరిష్కరించబడిన తరువాత ఆమె త్వరితగతిలో రాజసభలో శక్తివంతమైన వ్యక్తిగా మారింది. దారా షికో ఎప్పుడైనా అధికారంలోకి వస్తే వారసత్వ యుద్ధంలో తాను ధరించిన పాత్ర కారణంగా దారా షికో ఆమెను చంపేస్తాడని భయపడిన రోషనారా.. దారాను ఉరితీయాలని ఔరంగజేబును ఆదేశించాలని పట్టుబట్టింది. పురాణ కథనాల ఆధారంగా దారాను గొలుసులతో బంధించి చాందిని చౌకు చుట్టూ నడిపించి శిరచ్ఛేదం చేశారు. రోషనారా ఆ నెత్తుటి తలని బంగారు తలపాగాతో చుట్టి చక్కగా ప్యాకింగ్ చేసి ఔరంగజేబు బహుమతిగా తన తండ్రికి పంపింది.

# అమ్మాయి కోసం మైఖేల్ చేసిన మారణహోమం

సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'మైఖేల్'. రంజిత్ జైకోడి దర్శకుడు. విజయ్ సేతుపతి వరుణ్ సందేష్ గౌతమ్ మీనన్ అనసూయ వరలక్ష్మి శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు. దివ్యాంన్ష కౌశిక్ హీరోయిన్ కరణ్ సీ ప్రొడక్షన్స్ ఎల్ ఎల్ పీ శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పీ బ్యానర్ లపై భరత్ చౌదరి పుస్కూర్ రామ్మోహన్ రావు సంయుక్తంగా ఈ మూవీని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. గత




కొంత కాలంగా గేమ్ ఛేంజర్ మూవీ కోసం ఎదురు చూస్తున్న హీరో సందీప్ కిషన్ ఈ ప్రాజెక్ట్ పై భారీ ఆశలు పెట్టుకున్నాడు.యాక్షన్ తో పాటు రొమాన్స్ డ్రామా.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ నేపథ్యంలో అత్యంత భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా తెరకెక్కిన చిత్రమిది. సోమవారం ఈ మూవీ ట్రైలర్ ని విడుదల చేశారు. తెలుగులో అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ రిలీజ్ చేయగా తమిళంలో జయం రవి అనిరుధ్ రవిచంద్రన్ విడుదల చేశారు. మలయాళంలో క్రేజీ హీరో నవీన్ పాలీ రిలీజ్ చేశాడు. టీజర్ తో ఆసక్తిని రేకెత్తించి అంచనాల్ని పెంచేసిన ఈ మూవీ ట్రైలర్ తో కూడా ఆ అంచనాల్ని మరింతగా పెంచేసింది.'సముద్రపు అలలని చూస్తున్న ఓ పిల్లవాడి విజువల్స్ తో ట్రైలర్ మొదలైంది. మైఖేల్ విడోస్ స్పైడర్ తెలుసా నీకు. లవ్ తరువాత ఫిమేల్ స్పైడర్ మేల్ స్పైడర్ ని చంపేస్తుందంట' అంటూ గౌతమ్ మీనన్ చెబుతున్న డైలాగ్ లు ఆకట్టుకుంటున్నాయి. మైఖేల్ కి సలహాలిస్తూ హెచ్చరించే పాత్రలో గౌతమ్ మీనన్ నటించినట్టుగా తెలుస్తోంది. తన మాటలని పట్టించుకోకుండా అమ్మాయిల చుట్టూ తిరిగే యువకుడిగా సందీప్ కిషన్ నటించినట్టుగా కనిపిస్తోంది.ఆడదాని మాయలో పడి ఇబ్బందులు పడటమే కొంద మంది పురుషుల తలరాతగా రాసి పెడతాడు దేవుడు....ఇదంతా ఒక అమ్మాయి కోసం చేస్తున్నావా? .. నమ్మలేకపోతున్నా మైఖేల్.. ' అంటూ గౌతమ్ గౌతమ్ మీనన్ అనడం.. అమ్మాయి కోసం కాకపోతే ఎందుకు సార్ మనిషి బ్రతకాలి అని సందీప్ కిషన్ చెబుతున్న తీరు ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఓ అమ్మాయి కోసం మైఖేల్ చేసిన మారణహోమంగా ఈ సినిమా వుంటుందని ట్రైలర్ తో తెలుస్తోంది. ప్రతీ సీన్ లోనూ సందీప్ కిషన్ ఈ మూవీ కోసం ప్రాణం పెట్టినట్టుగా కనిపిస్తోంది.రంజిత్ జైకోడి టేకింగ్ భరత్ చౌదరి పుస్కూర్ రామ్మోహన్ రావు ల మేకింగ్ సరికొత్త అనుభూతిని కలిగించే కిరణ్ కౌశిక్ సినిమాటోగ్రఫీ సామ్ సీఎస్ సంగీతం సందీప్ కిషన్ విజయ్ సేతుపతి అనసూయ గౌతమ్ మీనన్ వరలక్ష్మి శరత్ కుమార్ వరుణ్ సందేష్ ల నటన సినిమాకు ప్రధాన హైలైట్ గా నిలుస్తున్నాయి.సందీప్ కిషన్ గత చిత్రాలకు పూర్తి భిన్నమైన పంథాలో సరికొత్త మేకింగ్ టేకింగ్ తో రూపొందిన ఈ మూవీ సందీప్ కిషన్ కెరీర్ కు గేమ్ ఛేంజర్ గా నిలిచేలా వుంది. ఈ మూవీని పాన్ ఇండియా వైడ్ గా ఫిబ్రవరి 3న అత్యంత భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు.

# రెండు పదాలతోనే ట్వీట్.. అభిమానుల్లో అంతులేని సంతోషం




టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా జట్టుకు దూరమై ఐదు నెలలు కావొస్తుంది. గతేడాది ఆసియా కప్‌లో భాగంగా మోకాలి గాయంతో జడ్డూ టీమిండియాకు దూరమయ్యాడు.అనంతరం బెంగళూరులోని ఎన్‌సీఏ అకాడమిలో రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉన్న జడేజా మోకాలికి వైద్యులు సర్జరీ నిర్వహించారు. అప్పటి నుంచి విశ్రాంతి తీసుకున్న జడేజా తాజాగా కోలుకొని రంజీ ట్రోఫీ ఆడేందుకు చెన్నైకు వచ్చాడు. సౌరాష్ట్ర తరపున తమిళనాడుతో చివరి రౌండ్ మ్యాచ్ ఆడనున్నాడు. కాగా ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాతో మొదలవనున్న నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం జడేజాను బీసీసీఐ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే.ఇక చెన్నైలో ఉన్న జడేజాకు ఈ ప్లేస్‌తో మంచి అనుబంధం ఉందన్న సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఐపీఎల్‌లో జడేజా చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. సుదీర్ఘకాలంగా సీఎస్కేతో కొనసాగుతూ జట్టు విజయాల్లో జడ్డూ కీలక పాత్ర పోషించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. చాలా రోజుల తర్వాత చెన్నైకి రావడంతో జడేజా తన ట్విటర్‌లో అభిమానులకు.."వణక్కం చెన్నై(నమస్కారం చెన్నై)" అంటూ విష్ చేశాడు. కేవలం రెండు పదాలతోనే ట్వీట్ చేయడం సీఎస్‌కే అభిమానులను సంతోషపెట్టింది.ఈ క్రమంలో జడేజా ట్వీట్ కు చెన్నై జట్టు అభిమానులు ఉత్సాహంగా స్పందిస్తున్నారు."జడేజాకు చెన్నై స్వాగతం పలుకుతోంది. సీఎస్‌కే అభిమాన ప్లేయర్ నువ్వు" అని ఒక అభిమాని పేర్కొనాడు. "నా అభిమాన రోల్ మోడల్కు వణక్కమ్. మైదానంలోకి తిరిగి సింహం అడుగు పెడుతోంది" అని మరొక అభిమాని కామెంట్ చేశాడు. "చెన్నై సూపర్ కింగ్స్‌కు తిరిగి స్వాగతం.. జడ్డూ నీ రాకింగ్ ప్రదర్శన కోసం వేచి చూస్తున్నాం.." అంటూ కొందరు కామెంట్లు పెట్టారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190